# శాంతి


# SANTI

విశ్వమానవ సౌభ్రాతృత్వ సందేశము గల ఆధ్యాత్మిక మాసపత్రిక

ఆగస్టు - August - 2021



ప్రణవోధనుః శరోహ్యాత్మా బ్రహ్మతల్లక్ష్యముచ్యతే
అప్రమత్తేన వేద్ధవ్యం శరవత్ తన్మయో భవేత్



## పరమపూజ్య శ్రీ స్వామి ఓంకార్ మహారాజ్

జననం : 1895 నిర్యాణం : 1982

# లోకశాంతి ప్రార్థన

## (వ్యక్తి శాంతికి - విశ్వశాంతికి)

పూజనీయమైన ఓ దివ్య స్వరూపా!
మా లోపలను వెలుపలను మీదను క్రిందను అంతటను
నిండియున్న ఓ సర్వాంతర్యామి! మా లోపల ప్రత్యణువు
నందును ఇమిడి యుండి మా నేత్రములకు నేత్రము,
కర్ణములకు కర్ణము, హృదయములకు హృదయము,
మనస్సులకు మనస్సు, శ్వాసలకు శ్వాస, ప్రాణములకు ప్రాణము,
ఆత్మలకు ఆత్మవై వెలుగొందు ఓ దేవా ! ప్రేమైక మూర్తీ !
నిన్ను తెలుసుకొను భాగ్యము ఇప్పుడు ఇచ్చటనే మాకు ప్రసాదింపుము.
ఓ తేజోమయమూర్తీ! తూర్పు పడమరల
ఉత్తర దక్షిణముల, ఈ విశ్వము నందంతటను అందరును
నీ దివ్య తేజస్సును గ్రహింతురు గాక!
ఓ సచ్చిదానంద స్వరూపా !
ప్రతి మానవ హృదయమునందును, నానాజాతి మధ్యమునను
శాంతి సామరస్యములను ప్రతిష్ఠింపజేయుము.
ఓ దేవా! ఇదియే మా మన: పూర్వకమైన ప్రార్థన.

లోకాస్సమస్తా స్సుఖినో భవంతు !

ఓం శాంతి శ్శాంతి శ్శాంతి :

ఏకం సత్ విప్రా బహుధా వదంతి

ఒకే సత్యము అనేక విధములుగా బ్రహ్మజ్ఞులచే చెప్పబడినది.

– ఋగ్వేద సంహిత

# శాంతి

# SANTI

విశ్వమానవ సౌభ్రాతృత్వ శాంతి సందేశ ఆధ్యాత్మిక మాసపత్రిక

**స్థాపకులు : పరమపూజ్య శ్రీస్వామి ఓంకార్‌జీ మహరాజ్**

**సంపాదకులు : స్వామిని వినమ్రానంద**

సంపుటి / **Vol. 97** ఆగస్టు/**August - 2021** సంచిక/**No.7**

| వ.నెం. | విషయ సూచిక | పేజి నెం. |
|---|---|---|
| 1. | ప్రార్థన – శ్రీ శంకరాచార్యకృత అద్వైతానుభూతిః | 2 |
| 2. | ధ్యానము – హస్తామలక కృత స్తోత్రం | 2 |
| 3. | ఓంకార్ ఆత్మకథ – అనువాదం : శ్రీమతి బొప్పన అరుణాదేవి | 3 |
| 4. | శ్రీకృష్ణ జన్మాష్టమి సందేశము – పూజ్యశ్రీ జ్ఞానేశ్వరి మాతాజీ | 8 |
| 5. | మనస్సుకు ప్రశాంతత – జి. నాగేశ్వరరావు | 11 |
| 6. | సార్వజననీనమైన మతము – నేడు దాని ఆవశ్యకత – జి. కృష్ణ | 13 |
| 7. | శ్రీ తులసీ సర్వస్వము – జి.వి.యస్. సుబ్రహ్మణ్య శర్మ | 15 |
| 8. | పిల్లల సూక్తులు – వి. శారద | 17 |
| 9. | సోమరి మీనా – స్వామి చిన్మయానంద | 20 |
| 10. | విజ్ఞప్తి – గో సంతతికై గోశాల విస్తరణ | 23 |
| 11. | దాతలకు విజ్ఞప్తి | 24 |
| 12. | కార్యక్రమములు, విరాళములు | 26–28 |

*** ఈ పత్రికలో ప్రచురింపబడిన వ్యాసముల యొక్క భావాలకు రచయిత్రి / రచయితలే బాధ్యులు కాని. సంపాదకులు కారు.**

**జీవిత సభ్యత్వం రూ. 1000/–లు సాలుసరి రూ.100/–**

# ప్రార్థన

## శ్రీ శంకరాచార్యకృత! అద్వైతానుభూతిః

### ప్రార్థన వలన అహంకారము నశించును

సర్గ స్థితి ప్రలయ హేతుమచింత్య శక్తిం । విశ్వేశ్వరం విదిత విశ్వ మనంతమూర్తిమ్ ॥
నిర్ముక్తబంధనమపారసుఖాంబురాశిం । శ్రీవల్లభం విమలబోధఘనం నమామి ॥

**సృష్టిస్థితి ప్రళయములకు కారణమైనవాడును, అచింత్య శక్తి కలవాడును, విశ్వేశ్వరుడును, విశ్వవిజ్ఞాతయును, అనంతమూర్తియును, మాయాపాశ నిర్ముక్తుడును, అపార సుఖస్వరూపుడును, నిర్మలజ్ఞానమూర్తియు నగు లక్ష్మీపతికి నమస్కరించుచున్నాను.**

యస్య ప్రసాదాదహమేవ విష్ణు । ర్మయ్యేవ సర్వం పరికల్పితఞ్చ ॥
ఇత్థం విజానామి సదాత్మరూపం । తస్యాంఘ్రియుగ్మం ప్రణతోస్మి నిత్యమ్ ॥

"నేనే విష్ణువును, విష్ణుస్వరూపుడనగు నాయందే ఈ విశ్వమంతయును పరికల్పితమైనది" అను జ్ఞానము ఎవని అనుగ్రహము వలన లభించుచున్నదో మరియు ఎవ్వడు నిత్యాత్మ స్వరూపుడో, అతని చరణయుగళమునకు నిత్యము నమస్కరించుచున్నాను.

# ధ్యానము

## హస్తామలక కృత స్తోత్రం

### ధ్యానం ద్వారా మనస్సు శాంతిని పొందుతుంది

నాహం మనుష్యో న చ దేవయకౌ న బ్రాహ్మణ
క్షత్రియ వైశ్య శూద్రాః
న బ్రహ్మచారీ న గృహీ వనస్థో భిక్షుర్న చాహం
నిజబోధ స్వరూపః

నేను మనిషిని కాను. యక్షదేవ గణాలకు చెందిన వాణ్ణి కాను. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్గాలకు చెందినవాణ్ణి అసలేకాను. నేను బ్రహ్మచర్య గృహస్థి, వానప్రస్థ, సన్న్యాస ఆశ్రమాలకు అతీతుణ్ణి. నేను ఆత్మను. అనంతమైన చైతన్య స్వరూపుణ్ణి.

# శాంతి ప్రదాత శ్రీ ఓంకార్ స్వామీజీ ఆత్మకథ

**అధ్యాయం - 29** అనువాదం : శ్రీమతి బొప్పన అరుణాదేవి

## మంచు మీద జారిపడిపోయాను

## భగవత్ సంకల్పమే జరుగుతుంది

గత సంచిక తర్వాత

మానవుడి జ్ఞానం చాలా తక్కువ. ఎవరికి తెలుసు మరు నిముషంలో ఏమి జరుగుతుందో. కనీసం ఊహించను కూడా లేడు. ఏ నిముషంలో అయినా ఏదయినా జరగవచ్చు.

నేను మరియా మాత ఆశ్రమమునుండి న్యూయార్క్ శాంతి కేంద్రానికి వెళ్లి అక్కడ ప్రవచనము చేయడానికి సిద్ధమవుతూ ఉన్నాను. మాతృమూర్తి శాంతి దేవీ, సోదరి రత్నం, కుమార్తె సుశీలదేవి న్యూయార్క్ శాంతి కేంద్రంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. సమావేశానికి ముందు ఘనమయిన స్వాగతం ఇవ్వడానికి నిశ్చయించారు. నేను సాధ్యమయినంత తొందరగా వీలయితే సమావేశానికి ముందుగానే అక్కడికి చేరుకోవాలని ఆత్రుతతో ఉన్నాను. మానవుడు ఒకటి సంకల్పిస్తే దేవుడు మరొకటి సంకల్పిస్తాడని పెద్దలు చెప్పే మాటల్లో ఎంతో వాస్తవం ఉంది. సాధారణంగా మరియా మాత, సూర్యానంద శాంతి కేంద్రాలలో సమావేశాలకి దగ్గరుండి తీసుకువెళుతుంటారు. కాని వారు వేరే కార్యక్రమానికి వెళ్ళవలసినందున వారు నేను ఒక్కడినే వెళ్ళడానికి అనుమతించారు. అందువల్ల ఆ రోజు నేను మరియామాత ఆశ్రమాన్ని వదిలి భగవంతుడి తోడుగా ఒక్కడినే బయలుదేరాను.

భగవంతుడు తోడుగా ఉన్నప్పటికీ, జరగవలసినవి జరిగే తీరుతాయి. కర్మ సిద్ధాంతము నుండి దేవతలు, భగవంతుడు కూడా తప్పించుకోలేరు. మానవుడు తన జీవితానికి తానే కర్తనని భావిస్తుంటాడు. కాని పూర్వజన్మల్లో చేసిన కర్మల ఫలితాన్ని లేదా ఈ జన్మలోనే చేసిన పనుల ఫలితాన్ని అనుభవించవలసి వస్తుంది. ఆ రోజు నేను చాలా ఆనందంగా ఉన్నాను. ఒక మంచి ఆధ్యాత్మిక కేంద్రాన్ని సందర్శించబోతున్నాను. అక్కడ ఎందరో భక్తులను, విద్యార్థులను, సాధకులను, జిజ్ఞాసువులను కలుసుకోబోతున్నాను. ఆనాటి ఆదివారం సాయంత్రం జగరబోతున్న సమావేశంలో అక్కడికి వచ్చే మంచి హృదయము, పవిత్రమయిన ఆత్మ కలవారు, భక్తులతో శాంతి సందేశాన్ని ప్రేమానురాగాలను పంచుకోబోతున్నాను. కాని భగవంతుని సంకల్పము, నా పూర్వ కర్మ ఫలితము వేరుగా ఉంది. నన్ను ఫిలడెల్ఫియా రైల్వేస్టేషన్‌కి తీసుకువెళ్ళడానికి కారు వచ్చింది. అక్కడి నుండి న్యూయార్క్ నగరము వందమైళ్ళ దూరములో ఉంది. కాబట్టి నేను న్యూయార్క్ శాంతి కేంద్రానికి ఉదయం పదిగంటలకే చేరుకుంటాను అని భావించాను.

అమెరికాలోని కొన్ని ప్రదేశాల్లో చలి విపరీతంగా ఉంటుంది. బకెట్లలోని నీరు కూడా మంచుగా మారిపోతుంది. ఇక రోడ్డు ప్రక్కన నడకదారి అంతా బురదలా మంచుపేరుకు

పోతుంది. దాన్ని స్లీట్ అంటారు. మంచు, నీరులా కనిపిస్తుంది. వాతావరణంలో మార్పు వచ్చినప్పుడు నేలంతా మంచు పేరుకు పోతుంది. కాని చూడడానికి మాత్రం నీరులా కనిపిస్తుంటుంది. మంచు కురుస్తున్నప్పుడు చూడడానికి ఎంతో అందంగా ఉంటుంది. చెట్లు, భవనాలు అన్నీ తెల్లని మంచుతో కప్పబడిపోతాయి.

ఆ రోజు ఉదయం తెల్లవారుజామున మంచు లేదు గాని స్లీట్ ఉంది. దాన్ని చూచి నేను వాన నీరు అని భ్రమపడ్డాను. నేను ఆశ్రమము నుండి బయటికి వచ్చి చూచినపుడు రహదారి బాగా తడిసిపోయి ఉంది. నేను మెట్లు దిగి క్రిందికి రాగానే రహదారిపై కాలు పెట్టగానే కాలుజారి పడిపోయాను. నేనింకా కాలు జారింది అందుకే పడిపోయాను అని భావించాను. అందువలన లేచి కారు వద్దకు వెళ్ళడానికి ప్రయత్నించాను. మళ్ళీ వెంటనే జారి మంచులో పడిపోయాను. ఈసారి నేను ఎంతగా ప్రయత్నించినా పైకి లేవలేక పోయాను. కారు నడిపే వ్యక్తి బెల్ మ్రోగించి మరియా మాతను పిలిచాడు. కారు నడిపే వ్యక్తి సాయంతో మరియా నన్ను నెమ్మదిగా లేపి ఇంట్లోకి తీసుకెళ్లి నా గదిలో మంచము మీద పడుకోబెట్టింది.

అమెరికా దేశంలో చలికాలంలో ఇలాంటి ప్రమాదాలు వేలల్లో జరుగుతుంటాయి. ఈ ప్రమాదాలను తప్పించుకోవడానికి ప్రజలు రబ్బరు తొడుగులను వాడతారు. మామూలుగా వాడే బూట్ల పైన రబ్బరు తొడుగులు వాడతారు. జారిపడిపోకుండా ఉండేందుకు వాటిని రక్షణగా ఉపయోగిస్తారు. కార్ల టైర్లను కూడా గొలుసులు వేసి రోడ్డు మీద జారిపోకుండా జాగ్రత్త పడతారు. ముఖ్యంగా ఎత్తైన కొండ ప్రదేశాలలో, రోడ్ల మీద చాలా ప్రమాదకరంగా ఉంటుంది. నాకు అనుభవం లేకపోవటం మూలంగా ఆ రోజు నేను రబ్బరు తొడుగులు వేసుకోలేదు.

మరియామాత ఎంతో అనుభవజ్ఞురాలయిన నర్సు కాబట్టి ఇలాంటి స్థితిలో ఎంత జాగ్రత్తగా చూసుకోవాలో బాగా తెలుసు. అందువలన వెంటనే వైద్యుడికి కబురు పెట్టింది. జాగ్రత్తగా పరీక్షించిన తర్వాత ఆయన ఎక్స్‌రే తీయవలసి ఉంటుందని, తుంటి ఎముక విరిగినట్లుగా అనుమానంగా ఉందని చెప్పాడు. అలాంటి పరిస్థితి ఉంటే నేను ఆసుపత్రిలో కొన్ని నెలలు ఉండవలసి వస్తుందని కూడా అన్నాడు. అది విన్న తర్వాత ఏమి చేయగలను? దేనిని మనము బాగు చేయలేమో, దాని గురించి ఎంతో ఓపికగా ఎదురుచూడాలి అంతే.

మరియా ఎంతో ఓపిగ్గా, ప్రేమగా బలవర్థకరమయిన ఆహారాన్ని తయారుచేసి నా మంచం వద్దకే అన్నీ తీసుకువచ్చి తినిపించేది. తుంటి ఎముక విరగటం వలన కొంత నొప్పితో బాధపడినట్లు గుర్తుంది. ఈ విధమయిన ప్రమాదాలు సంభవించినపుడు అమెరికాలో వైద్యం కోసం చాలా ఖర్చు పెట్టవలసి వస్తుంది. మరియా, సూర్యానంద నా వైద్యం కోసం, మందులు, హాస్పిటల్ ఖర్చులు భరించగలిగేంత ధనవంతులు కారు. అందువలన వారు చాలా ఆందోళన చెందసాగారు. అది చూచి నాకు కూడా నిరాశ కలిగింది.

భగవంతునికి బాగా తెలుసు. తన బిడ్డలకి ఏది మేలు చేస్తుంది అనే విషయం. చిన్న పిచ్చుక నుండి పాకే చీమ గురించి కూడా ఆయన చూసుకుంటాడు. ఏమి జరిగినా అంతా మంచికే అంటారు. ఎందువల్లనంటే నేను శాంతి కేంద్రాల స్థాపన కోసం తపన పడుతూ పరుగులు పెడుతున్నాను. ఎందరో ధనవంతులు, భక్తులయిన మహిళలు అంకితభావంతో శాంతి కేంద్రాల స్థాపనకై పనిచేస్తున్నారు. అందరూ నా దగ్గర సాధన చేసే వారే. ఇప్పుడు ఈ పరిస్థితి చూస్తుంటే వారందరికి ఇది ఒక పరీక్షలా అనిపించింది నాకు. ఎవరు నిజమయిన భక్తులు, స్నేహితులు నా గురించి శ్రద్ధ తీసుకుంటారో, నేను తిరిగి మామూలు స్థితికి వచ్చేవరకు అంకిత భావంతో భక్తి శ్రద్ధలతో ఎవరు నా గురించి నిలబడతారో వేచి చూడాలి. అప్పుడు నేను మరియామాతతో వెంటనే న్యూయార్క్‌లోని భక్తురాలు శ్రీమతి జీన్ డి లిల్లికి ఈ ప్రమాదం గురించి తెలియచేయమని చెప్పాను. అది తెలిసిన వెంటనే ఆమె పరిస్థితిని తన చేతుల్లోకి తీసుకొని అన్ని ఏర్పాట్లు చేసింది. నన్ను న్యూయార్క్‌లోని వారి ఇంటికి తీసుకువెళ్ళాలని నిర్ణయించుకుంది. ఆమె ఇల్లు కూడా న్యూయార్క్‌లో శాంతికేంద్రంగా పనిచేస్తోంది.

నన్ను న్యూయార్క్ చేర్చటానికి ఎంతో ఖర్చు పెట్టి అంబులెన్స్‌ని పంపించింది. రత్నం, సుశీలా కూడా జాగ్రత్తగా వాళ్ళతో తీసుకువెళ్ళడానికి అంబులెన్స్‌లో వచ్చారు. వారందరూ ఎంతో దయా హృదయము గల మంచి వ్యక్తులు. మరియా నా తుంటి ఎముక విరిగినందుకు చాలా బాధపడుతోంది. ఆమె హృదయం ముక్కలయిపోయింది. అంతేకాక నాకు ఎంతో అవసరమయినప్పుడు సేవలు చేయడానికి అవకాశం లేకపోవటం ఆమెకు చాలా బాధ కలిగించింది. కాని పరిస్థితుల వలన తప్పనిసరిగా నన్ను వారితో పంపించడానికి అంగీకరించింది. నా వైద్యం కోసం చాలా ఖర్చు పెట్టవలసి వస్తుంది. హాస్పిటల్‌లో ఉంచాలి. తరుచుగా డాక్టర్లు, నర్సులు పర్యవేక్షణలో ఉండాలి. అన్నీ అర్థం చేసుకొని భగవంతుని ఇచ్ఛకు వదిలి నన్ను వారితో న్యూయార్క్ పంపటానికి సంసిద్ధురాలయ్యింది.

నేను ఒక్క అడుగు కూడా వేయలేని, కదలలేని స్థితిలో ఉన్నాను. అందువల్ల నన్ను స్ట్రెచర్ మీద ఏటవాలుగా పడుకోబెట్టి తీసుకువెళ్ళి అంబులెన్స్‌లో ఎక్కించారు. శాంతి దేవి, రత్నం, సుశీలా నా ఎదురుగా కూర్చొన్నారు. నేను కళ్ళు మూసుకొని నవ్వుతూ భగవంతునికి ధన్యవాదాలు తెలుపుకున్నాను. ధ్యానంలో మునిగిపోయాను. దైవము ఎల్లప్పుడూ నన్ను జాగ్రత్తగా గమనిస్తూ కాపాడుతున్నాడు. కేవలం నన్ను మాత్రమే కాదు. సృష్టిలోని ప్రతి ప్రాణి పట్ల ఆయన అంతే దయ చూపిస్తారు. నేను మంచు మీద జారిపడిపోయినపుడు నా పక్కనే ఉన్నాడు. ఎందువల్లనంటే దైవము సర్వత్రా వ్యాపించి ఉంటాడు. అది తెలుసుకోగలిగినవారు అదృష్టవంతులు. బాధల్లోనూ, సుఖాల్లోనూ, పరీక్షల్లోనూ, కష్టాల్లోనూ, జీవితంలో అనుకోకుండా జరిగే సంఘటనలన్నింటిలోనూ భగవంతుని మరిచి పోకుండా గుర్తుంచుకోగలిగినవారు ధన్యులు. వందమైళ్ళ దూరం ప్రయాణం చేసి న్యూయార్క్ నగరం చేరుకునేంత వరకూ మేమందరము మౌనంగా ధ్యానం చేస్తూ పరమాత్మకి ధన్యవాదాలు తెలియజేసుకున్నాము.

న్యూయార్క్ చేరుకోగానే ఎంతో సౌకర్యవంతమయిన శాంతిదేవి గారి ఇంటిలో మేడ పై భాగంలోని గదిలో నన్ను జాగ్రత్తగా పడుకోబెట్టారు. కొందరు అనుభవజ్ఞులు నన్ను హాస్పిటల్‌కి తరలించటం మంచిదని సలహా ఇచ్చారు. అక్కడ మంచి వైద్య సదుపాయాలు ఉంటాయని చెప్పారు. కాని భక్తులు అందుకు అంగీకరించలేదు. శాంతాదేవి ఉంటున్న బహుళ అంతస్తుల భవనంలోనే క్రింది అంతస్తులో నా భక్తులు స్పానిష్ వైద్యుడు డా॥ డెల్‌వల్లి అతని భార్య మేరి ఉంటున్నారు. వారిద్దరూ కూడా నా వద్ద ధ్యానంలో మెలకువలు నేర్చుకునేవారు. వారు నా వద్ద ఉచితంగా ధ్యానం తరగతులకు వచ్చేవారు. ఇప్పుడు వారికి నాకు సేవలందించేందుకు చాలా మంచి అవకాశం దొరికింది. ఈ విధంగా నేను జబ్బుతో మంచంలో ఉన్నప్పుడు నాకు అవసరమయిన వైద్య సేవలు అందించి కృతజ్ఞతలు తెలియజేయాలనుకున్నారు. అందువలన వారు నన్ను హాస్పిటల్‌కి పంపించకుండా, లిల్లి ఇంటిలోనే ఉంచి వైద్యం చేయసాగారు. నా పూర్తి బాధ్యత ఆ దంపతులు తీసుకున్నారు. ఏమయినా సలహాలు, సూచనలు కావలసి వచ్చినప్పుడు ఆయన తన తోటి వైద్యులను కూడా తీసుకువచ్చేవారు. అందుచేత వారు కూడా నా సౌకర్యం కోసం ఇంటిని వైద్యశాలగా మార్చి నాకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చాలా జాగ్రత్తగా చూసుకున్నారు. దాని వలన ఖర్చు కూడా బాగా తగ్గింది.

నన్ను జాగ్రత్తగా చూసుకోవటానికి పగలు ఒకరు, రాత్రివేళ ఒకరు భక్తులయిన ఇద్దరు నర్సులను నియమించారు. ఎక్స్‌రే పరికరాలు డా॥ డెల్‌వల్లి హాస్పిటల్ నుండి తీసుకువచ్చి ఇంటిలోనే పరీక్షించారు. అతను నా వద్ద ధ్యానం నేర్చుకునే విద్యార్థి కనుక నా వైద్యం గురించిన పూర్తి బాధ్యతలు అతనికే అప్పగించబడ్డాయి. మా అందరికి అతని సామర్థ్యం మీద పూర్తిగా నమ్మకముంది. అందువలన అతను ఎలా నిర్ణయిస్తే అలాగే చేయాలని అనుకున్నాను. మరికొందరు అతనితో పాటు పనిచేసే వైద్యులు కూడా వచ్చి పరీక్షించి తుంటి ఎముకకి ఎక్స్‌రే తీశారు. మా అందరికి నిరాశను కలిగిస్తూ నా తుంటి ఎముక రెండు చోట్ల విరిగినట్లుగా నిర్ధారించబడింది.

భగవంతుని పట్ల అపారమయిన నమ్మకము కలవాడిని కావటం వలన, ఏమి జరిగినా అంతా ఆయన లీలగా భావిస్తాను. ఏది ఊరికే జరగదు. అంతా దైవ నిర్ణయం ప్రకారమే జరుగుతుంది అని నాకు బాగా తెలుసు. అందువలన నేను అంత బాధలో కూడా సంతోషంగా ఉండడానికి ప్రయత్నించేవాడిని. నేను ఒక రోజు. రెండు రోజులలో కాకుండా కొన్ని నెలల పాటు మంచం మీద గడపాల్సి ఉంటుంది. కనుక ఈ సమయాన్ని జాగ్రత్తగా సద్వినియోగం చేసుకోవాలని నిశ్చయించుకున్నాను. కాని నా స్నేహితులు, భక్తులు, నా శ్రేయోభిలాషులు ప్రత్యేకంగా శాంతదేవి నా పరిస్థితి చూసి చాలా విచారించారు. శాంతదేవి నన్ను తన సొంత బిడ్డలాగా ఎంతో జాగ్రత్తగా, ప్రేమగా చూసుకునేది. ఆమె నా కోసం నియమించిన నర్సులకు వెయ్యి రూపాయలకు పైననే జీతంగా ఇచ్చేది. నా పొట్ట మీద నుండి ఎడమ కాలు అంతా సిమెంటు కట్టు వేశారు. ఇప్పుడు నేను కుడి లేదా ఎడమ వైపుకు కూడా తిరగలేని పరిస్థితి

ఏర్పడింది. అలాంటి దుర్భరమైన స్థితిలో కూడా నేను ధైర్యం కోల్పోకుండా చిరునవ్వుతో నా భక్తులతో బాధపడవద్దు అని చెప్పేవాడిని. ఎప్పుడూ నవ్వుతూ, భగవంతుని ఉనికిని అనుభవిస్తూ ఉండాలని ప్రబోధించేవాడిని. ఇదంతా పరమాత్మ ధ్యానంలో కాలం గడపడానికి వచ్చిన గొప్ప అవకాశంగా నాకు అనిపించింది. భక్తులతో కూడా అదే విషయాన్ని చెప్పేవాడిని.

ఆకస్మికంగా జరిగిన ప్రమాదం గురించి తెలుసుకున్న నా భక్తులు, నా వద్ద ధ్యానం నేర్చుకునే విద్యార్థులు పగలు, రాత్రి తేడా లేకుండా గుంపులుగా వచ్చి నాకు సానుభూతి తెలుపుతూ విచారం వ్యక్తం చేయసాగారు. అదేపనిగా నన్ను చూడడానికి అలా అందరూ రావటం వలన నాకు చాలా ఇబ్బందిగా ఉండేది. డాక్టర్లు, నర్సులు కూడా అలా నన్ను ఇబ్బంది పెట్టకూడదని వారితో చెప్పారు. చివరికి చూడడానికి వచ్చేవారికి మధ్యాహ్న సమయాన్ని కేటాయించారు. కొందరు చూడడానికి వచ్చిన వాళ్ళ మాటలు, గుసగుసలు నాకు ఆందోళన కలిగించేవి. వచ్చినవాళ్ళు గతంలో జరిగిన ప్రమాదాల గురించి వాళ్ళకు తెలిసిన వారికి జరిగిన ప్రమాదాల గురించిఅలాగే వార్తా పత్రికల్లో చదివిన వాటిని గురించి వివరిస్తుండేవారు. సమయం విలువ తెలిసిన నాకు వారి అనవసరపు మాటలు నా తుంటి ఎముక విరగటం వలన కలిగిన బాధ కంటే ఎక్కువగా అనిపించేది. అనవసరమయిన సానుభూతి, వ్యతిరేక భావాలు కల్గించే మాటలు ఎక్కువగా బాధించాయి. నా ఆలోచనలను కాగితం మీద రాసి వాటిని ముద్రించి చూడడానికి వచ్చే వారందరికీ ముందుగానే అందచేసే వాళ్ళము. దానితో వారు అలాంటి మాటలు ఏమీ మాట్లాడకుండా మౌనంగా చూచి వెళ్ళిపోయేవారు. అనుకోకుండా ఆ రోజు నేను వారికి ముద్రించి ఇచ్చిన కాగితం దొరికింది. అందులోని ప్రతి మాటా మీ కోసం ఇక్కడ వ్రాయాలి అని భావిస్తున్నాను.

**చూడటానికి వచ్చే వారికి సూచనలు :**

దయచేసి ముఖాలు వ్రేలాడేసుకుని, విచారంగా నన్ను చూడడానికి రావద్దు. వాటిని బయట వదిలి పెట్టి, చిరునవ్వుతో లోపలికి రండి. మంచి మాటలు మాట్లాడండి. దయచేసి మీ తాతగారికి, అమ్మమ్మ గారికి జరిగిన ప్రమాదాల గురించి మాట్లాడవద్దు. మీ జీవితంలో జరిగిన దురదృష్టకరమైన విషయాల గురించి, ప్రపంచంలోని బాధలు, కష్టాల గురించి మాట్లాడవద్దు. విచారకరమైన ప్రమాదాలు, విమానాలు, రైళ్ళు పడిపోవటం గురించి వార్తాపత్రికల్లో చదివి వాటిని గురించి ఇక్కడ మాట్లాడవద్దు. తప్పనిసరిగా మాట్లాడాలి అని మీకు అనిపిస్తే భగవంతుని గురించి మాట్లాడండి. లేదా మౌనంగా ఉండండి. మీ అనవసర ప్రసంగాలు, వ్యర్థమైన ఆలోచనల ద్వారా దివ్యమైన దైవభావాన్ని అనుభవించకుండా అడ్డు పడవద్దు. మీ ప్రేమ, సానుభూతి అవసరమయిన వారి వద్దకు వచ్చినప్పుడు ఏమి మాట్లాడాలో బాగా ఆలోచించుకుని మాట్లాడండి. సందర్శకులకు, భగవంతుడు మీకు ఆశీర్వాదాలు అందించుగాక! మీరు నిశ్శబ్దంగా బయటికి వెళ్ళండి. సంతోషానికి మార్పులేదు. శాంతిని ప్రసాదించుమని, అందరికీ ఆరోగ్యాన్ని అందించమని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను.

# శ్రీకృష్ణ జన్మాష్టమి సందేశము

పూజ్యశ్రీ జ్ఞానేశ్వరి మాతాజి

## అహంకారము నశించిన శ్రీకృష్ణతత్త్వము గోచరమగును

హరియను రెండక్షరములు
హరియించును పాతకముల నంబుజనాభా !
హరి నీ నామ మహత్త్వము
హరి యని బొగడంగ తరమే హరి శ్రీకృష్ణా

శ్రీకృష్ణ పరమాత్మ మానవోద్ధరణకు యీ పవిత్రమైన భారతావనిలో జన్మించుట చేతనే మనదేశము, ఈ భూమండలములో జ్ఞానతపోభూమిగ అఖండఖ్యాతి నొందినది. శ్రీకృష్ణావతారము అవతారములలోకెల్ల గొప్ప అవతారమని చెప్పబడుచున్నది. వీరు కురుక్షేత్రములో లోకోద్ధరణకు చేసిన ప్రబోధమే భగవద్గీత. అట్టి పవిత్ర భగవద్గీత సనాతన ధర్మమై శాశ్వత కీర్తిని గాంచినది.

ఇప్పుడు అవతార్ మెహర్ బాబా కూడా యీ పవిత్ర భారతదేశంలో 25-2-1894వ తేదీన జన్మించి, తానే శ్రీరామచంద్రమూర్తిగ, శ్రీకృష్ణ భగవానునిగ అవతరించితినని చెప్పుచుండెను. వీరు భగవద్వచనం అను గ్రంథమును ఆంగ్లములో ముఖ్యముగా పాశ్చాత్యదేశీయుల కొరకు, గీతాసారమునే వారి మనస్తత్త్వమునకు సరిపడునట్లు రచియించిరి. ఇది చాలా గొప్ప గ్రంథమని కొనియాడబడుచున్నది. వారి బోధనాసారము శ్రీకృష్ణ ప్రేమతత్త్వమే, మురళీగానమే, త్యాగమే. ఈ సుదినమున గీతనేగాక, శ్రీకృష్ణ జీవితమును అనగా గీతానుష్టానమునే ఒకసారి తప్పక ప్రతివారు జ్ఞాపకముచేసుకొని ఆనందించవలసి యున్నది. భాగవతము దశమస్కందము యీ నాడైనను ముఖ్యముగ చదువ దగినది.

మధురా నగరములో ఆయన ప్రవేశించుచున్నపుడు ఆ పట్టణ స్త్రీలు ఆయనను చూచి ఎట్లు తలచిరో భాగవతములో యీ దిగువ పద్యము చక్కగ తెలుపుచున్నది. అది వారికే కాదు. లోకములోని భక్తులందరికి వర్తించును.

సీ. వీడటే రక్కసి విగతజీవగ జన్ను బాలు ద్రావిన మేటిబాలకుండు,
వీడటే నందుని వెలదికి జగమెల్ల ముఖమందు జూపినముద్దులాడు,
వీడటే మందలో వెన్నలు దొంగిలి దర్పించి మెక్కిన దాపరీడు
వీడటే యెలయించి వ్రేతలమానంబు సూఱలాడిన లోకసుందరుండు
తే. వీడు లేకున్న పుర మటవీస్థలంబు, వీని బొందని జన్మంబు విగత ఫలము
వీని బలుకనివచనంబు విహగరుతము, వీని జూడని చూడ్కులు వృథలు వృథలు

భాగవతం 10 స్కం (పూర్వ) ప. 1248

రుక్మిణిదేవి ఆయన గురించి ఎట్లు తలంచినది, ఇతర భక్తులు ఎట్లు గ్రహించినదియు యీ దిగువ పద్యములు స్పష్టముచేయుచున్నవి. ఇట్టి అమూల్య పద్యరత్నము లెన్నియో యీ స్కంధమునందున్నవి. రుక్మిణీదేవికి, శ్రీకృష్ణుని పై గల భక్తి భావమును గాంచుడు.

సీ. ఏ నీ గుణములు కర్ణేంద్రియంబులు సోక, దేహతాపంబులు దీరిపోవు
నే నీశుభాకార మీక్షింపగన్నుల కఖిలార్థ లాభంబు గలుగుచుండు
నే నీచరణ సేవ లేప్రొద్దు చేసిన, భువనోన్నతత్వంబు బొంద గలుగు
నే నీలసన్నామ మే ప్రొద్దుభక్తితోదడవిన, బంధసంతతులువాయు,
తే॥ నట్టి నీ యందు నా చిత్త మనవరతము
నచ్చియున్నది నీ యాన నానలేదు
కరుణజూడుము కంసారి! ఖలవిదారి!
శ్రీయుతాకార! మానినీ చిత్తచోర!

భాగవతం 10 స్కం. (పూర్వ) ప 1704

పరమ పావనుడైన శుకయోగి గోపాలకులతో అరణ్యమున గ్రుమ్మరెడి బాలగోపాలుని చర్యలెంత మనోహరముగా చిత్రించెను. భక్తాగ్రేసరుడైన పోతనా మాత్యుని కవితలో ఆ మోహన రూపము మన కన్నుల కట్టినట్లుండును.

సీ. వేదాంత వీథుల విహరించు విన్నాణి, విహరించు గాంతార వీథులందు
ఫణిరాజశయ్య పై బవళించు సుఖభోగి, పల్లవశయ్యల బవ్వళించు
గురుయోగి మానసగుహల గ్రుమ్మరుమేటి, గ్రుమ్మరు నందీంద్రగుహలలోన
గమలతోడ బెనంగి కడు డయ్యు చతురుడా, భీరజనులతోడ బెనగిడయ్యు
ఆ. నఖిలలోకములకు నాశ్రయుండగు ధీరు
డలసి తరులనీడ నాశ్రయించు
యాగభాగచయము లాహరించు మహాత్ము
డడవిలోని ఫలము లాహరించు

భాగవతం 10 స్కం. (పూర్వ) 617

భాగవతోత్తముడైన భీష్ముడు, యుద్ధరంగమున చక్రముపట్టను అని చెప్పిన శ్రీ కృష్ణునంత వానిచే చక్రము చేతపట్టించెను. స్వచ్ఛంద మరణశీలి యగు నాతడు అంపశయ్యపై నుండి నాడు తనను చంపవచ్చెడి శ్రీకృష్ణ రూపమును స్మరించుచు వారిని స్తుతించిన రీతి కడు మనోహరముగా యుండును.

సీ. కుప్పించి యెగసిన గుండలంబులకాంతి గగన భాగం బెల్ల గప్పికొనగ
నురికిన నోర్వక యుదరంబులో నున్న, జగములవ్రేగున జగతిగదల
జక్రంబు జేపట్టి చనుదెంచు రయమున, బైనున్న పచ్చనిపటము జాఱ
నమ్మితి నాలావు నగుబాటు సేయక మన్నింపుమని క్రీడి మరల దిగువ
తే. గరికి లఘించు సింహంబుకరణి మెరసి, నేడు భీష్ముని జంపుదు నిన్ను గాతు
విడువు మర్జున యనుచు మద్విశిఖవృష్టి, దెరలిచనుదెంచు దేవుండు దిక్కునాకు

భాగవతం 1 స్కం.

చతుర్ముఖ బ్రహ్మయే శ్రీకృష్ణ పరమాత్మను తన యహంకారము చేత మొదట గుర్తించలేక గోవత్సములను గోపాలురను అంతర్ధానంబుచేసి, తిరిగి ఆ కృష్ణపరమాత్మ చేత సంకల్ప మాత్రమున వాటిని సృష్టింపబడుట చూచి, చాలా ఆశ్చర్యపడి, కొంత సేపటికి నిజము తెలుసుకొని, ఆ పరమాత్మను యీ విధముగా స్తుతించెను.

సీ. అదిగాక నిజరూప మనరాదు కలవంటి దై బహువిధ దుఃఖమైవిహీన
సంజ్ఞానమై యున్న జగము సత్సుఖబోధతనుడవై తుది లేక తనరుదీవు
మాయచే బుట్టుచు మనుచు లేకుండుచు నున్న చందంబున నుండుచుండు
వొకడ వాత్ముడ వితరోపాధిశూన్యుండ వాద్యుండ వమృతుండ వక్షరుండ
ఆ. వద్వయుండవును స్వయం జ్యోతి వావూర్ణు
డవు పురాణపురుషుడవు నితాంత
సౌఖ్యనిధివి నిత్యసత్యమూర్తివి నిరం
జనుడ వీవు దలపజనునె నిన్ను భాగవతం 10స్కం. (పూర్వ) ప. 566

వ. దేవా! యిట్టి నీవు జీవాత్మ స్వరూపుండవును, సకలాత్మలకు, నాత్మయైన పరమాత్మ స్వరూపకుడవు, నని యెవ్వరెరుంగుదురు, వారు, గదా గురువనియెడు దినకరుని వలన బ్రాప్తంబైన యుపనిషదర్థజ్ఞానంబను సునేత్రంబునంజేసి, సంసారమిథ్యాసాగరంబు దరించిన చందంబున నుండుదురు, రజ్జువందు రజ్జువని యెరింగెడి యెరుక లేకుండ, నయ్యెరుం గమి, నది సర్పరూపంబయి తోచిన పిదప నెరంగిన వారి వలన రజ్జువు (త్రాడు) రజ్జువని ఎరుంగచుండ, సర్పంబులేకుండ కైవడి నాత్మయ పరమాత్మయని యెవ్వరెరుంగరు. వారి కయ్యెరుంగమివలన సకల ప్రపంచంబు గలిగిలేచు నాత్మయప్పరమాత్మయని యెవ్వరెంగదురు వారికయ్యెరుంగమి వలన సకల ప్రపంచంబు గలిగితోచు, నాత్మయప్పరమాత్మయని యెవ్వరెరుంగుదురు, వారికయ్యెరుక వలన ప్రపంచంబులేకుండు, నజ్ఞానసంభావిత నామకంబులైన సంసార బంధ మోక్షంబులు జ్ఞాన విజ్ఞానంబుల లోనివిగావు కావున కమల మిత్రున (సూర్యుడు) కహోరాత్రంబు లేని తెరంగున బరిపూర్ణజ్ఞాన మూర్తి యగు నాత్మయందు నజ్ఞానంబులేమిని బంధంబును, సుజ్ఞానంబు లేమిని మోక్షంబునులే, వాత్మవైన నిన్ను దేహాదికంబని తలంచియు, దేహాదికంబు నిన్నుగా దలంచియు నాత్మ వెలినుండునంచు, మూఢులు మూఢత్వంబున వెదకుచుందురు, వారి మూఢత్వంబు జెప్పనేల? బుద్ధిమంతులై పరతత్వంబు గాని జడంబును నిషేధించుచున్న సత్పురుషులు తమ శరీరంబులయందు నిన్నరయుచుండ, రదిగావున.

శా. దేవా నీ చరణ ప్రసాదకణలబ్ధింగాక లేకున్ననొం
డే వెంటం జను నీ మహామహిమ నూహింపంగ నెవ్వారికిన్?
నీవారై చనువారిలో నొకడనై, నిన్ గొల్చు భాగ్యంబు నా
కీవే యిప్పటి జన్మమం దయిన నొం డెం దైన నో యీశ్వరా!
భాగవతం 10 స్కం (పూర్వ) ప. 568.

బ్రహ్మయే కృష్ణుని గుర్తించలేక చాలా బాధపడినపుడు మామూలు వారు గుర్తించలేకపోగా, శ్రీ భగవానుని లీలలు విని కూడ ఆనందించలేక పోవుచున్నారు. ఈ మానవజన్మ మనకు శ్రీపరమేశ్వరుడొసంగినది ఆయనను తెలుసుకొనుటకే యను సత్యమును కూడ కలికాలమగుటచేత గుర్తించ లేక పోవుచున్నారు.

ఏనాడు శ్రీకృష్ణపరమాత్మ నిజతత్వమును తెలుసుకొన గలుగుచుంటిమో, ఆనాడే శ్రీపరమేశ్వరుని అనుగ్రహముచేత మనము తరించి జీవన్ముక్తి శుభమనుభ వించగలుగుచున్నాము. ఇది భారతీయుల జన్మ హక్కని మరువ రానిది.

ఓం శ్శాంతిః శ్శాంతిః శ్శాంతిః

(శాంతి ఆగస్టు 1968)

# మనస్సుకు ప్రశాంతత

జి. నాగేశ్వరరావు

## మనశ్శాంతికి వలసిన నాలుగు లక్షణాలు

సుఖవంతుల యెడ మైత్రీ భావమును, దుఃఖితుల విషయములో కరుణను, పుణ్యపురుషుల యందు ఆనందమును దుర్మార్గుల యందు ఉపేక్షాభావమును కలిగియుండిన మనస్సుకు ప్రశాంతత లభించును.

పతంజలి యోగ సూత్రములన్నింటిలో యీ సూత్రము అత్యంత ముఖ్యమైనది. ఇందు వివరించిన విషయములు సాధకులకు మాత్రమే గాక సాధారణ మానవులకు కూడా అత్యంత ఉపయోగకరమైనవి. ఏ మానవుడైనను మనశ్శాంతితో బ్రతకవలెనని కోరిన యెడల, అతడు తప్పక ఇవి తెలుసుకొని సంఘములో మెలగవలసియుండును. యీ సూత్రము వాడు, వీడు అనుభేదము లేకుండా అందరికి వుపయోగపడును.

సంఘములో ప్రజలను నాల్గు విధములుగా విభజించినారు. ఈ నాల్గు వర్గముల వ్యక్తులతోను మరియొక వ్యక్తి ఎట్లు ప్రవర్తించ వలయునను విషయమును అతికుశలతతో వర్ణించినారు.

**1. సుఖవంతుడు :–** సుఖవంతుని చూచినప్పుడు, రెండవ వాని మనస్సు నందు **అసూయ** తలెత్తును. అసూయ అవగుణములలో మొదటిది. ఒక్క అసూయ ఉండిన చాలును మిగిలిన అవగుణములు వాటంతట అవే వచ్చి చేరును. ఈ అసూయ వలన సుఖవంతునికి ఎటువంటి ఇబ్బంది కలుగదు. అతని జీవితము సుఖముగానే జరిగిపోవుచుండును. కానీ అసూయపరుడు మాత్రము తన మనశ్శాంతి కోల్పోయి దుర్భరమైన మనఃక్షోభకులోనై దుఃఖమయ జీవితమును గడుపుచుండును. కావున సుఖవంతుని జూచి అసూయ పడినందున అసూయాపరుడే నష్టపోవును. కాబట్టి సుఖవంతుని జూచినపుడు అతడు గత జన్మలో గడించిన పుణ్య ఫలమును ఇపుడు అనుభవించుచున్నాడని తలంచి, అతని అదృష్టమును చూచి సంతసించి, అతనితో మిత్రత్వము నెరపిన మనశ్శాంతితో జీవించగలరు.

**2. దుఃఖ పీడితులు:–** అట్టి వారిని చూచినప్పుడు వ్యక్తిలో ఒక భావము ఏర్పడును. అతడు గత జన్మలో ఆచరించిన చెడు కర్మల ఫలమును ఇప్పుడు అనుభవించుచున్నాడు. దానికి మనము ఏమి చేయగలము అను భావన కలుగును. అట్టి భావన కూడా మంచిదికాదు. దుఃఖపీడితుని చూచినప్పుడు మనలో **కరుణ** కలుగవలెను. మన శక్తి కొలది అతనికి సహాయము చేయవలెను. మన సహాయము అతనికి ఎంత వరకు వుపయోగపడును అనునది వేరేవిషయము. కాని దాని వలన మనమస్సుకు వూరట కలిగి మనశ్శాంతి లభించును. మనకు మనఃశ్శాంతి కలుగుటయే మన ధ్యేయము.

**3. పుణ్యాత్ములు:- సత్ప్రవర్తనులు :-** అట్టి వారిని జూచి వారిలో నున్న గొప్ప గుణములను గమనించి **ఆనందించ**వలయును. అంతియే గాని వారి గొప్పదనమును చూచి, అసూయ జెందరాదు, ద్వేషించరాదు. అట్టి వ్యక్తిని ఆదర్శపురుషునిగా స్వీకరించి అతనిలో నున్న మంచి గుణములను మనలో కూడా పెంపొందించుకొనవలెను. అంతియే గాని అతనిని క్రిందకి లాగుటకు ప్రయత్నించరాదు.

**4. అధర్ములు :- దుష్టులు :-** అట్టివారు గూడ మన జీవితములో అప్పుడప్పుడు తలస్థపడుదురు. అట్టివారి విషయములో **ఉపేక్షాభావము** కలిగి ఉండవలెను. 'హా! ప్రపంచములో అట్టి వ్యక్తులు కూడా ఉంటారు. మొన్నటి వరకు దుష్టులుగా వున్న వ్యక్తులు ఈ రోజు సన్మార్గులుగా మారుటలేదా? అట్లే ఇతడు కూడా రేపటికి సన్మార్గుడు గావచ్చునని' భావన కలిగి ఉపేక్షించవలెను. అంతేకాని వారికి సలహా యిచ్చుటకు ప్రయత్నించిన మన మనఃశ్శాంతిని కోల్పోవలసివచ్చును.

ఈ సందర్భమున ఒక చిన్న కథ చెప్పబడినది. ఒక చెట్టుపై ఒక పిచ్చుక చక్కని గూడు అల్లుకొని నివసించుచుండెను. ఒక వర్షపు దినమున ఆ పిచ్చుక నివశించు కొమ్మకు ఎదుట కొమ్మపై ఒక కోతి వర్షములో తడుచుచూ కూర్చుని వుండెను. తన వెచ్చని గూటి నుంచి పిచ్చుక తలను బయటకు పెట్టి కోతిని చూచి యిట్లనెను. ఓ మిత్రమా! నేను యింత చిన్న పక్షిని. నాకు ఒక చిన్న ముక్కు తప్ప నీవలె చేతులు లేవు. నేను చిన్న ముక్కుతోనే చక్కని యింటిని కట్టుకొని నివసించుచున్నాను. ఈ వర్షము కొన్ని రోజులు కురిసినప్పటికి నేను హాయిగా నివసించగలను అనెను. నీవు కూడా నీ మెదడును ఎందుకు ఉపయోగించ లేదు? ఒక చక్కని గుడిసె నిర్మించుకొని, హాయిగా వుండవచ్చు కదా అనెను.

ఈ మాటకు కోతి రుద్రుని వలె రౌద్రము పూని యిట్లు పలికెను. "ఓ చిన్న రాక్షసీ! యీ విధముగా సలహా నిచ్చుటకు నీకెంత ధైర్యము? నీవు నీ యింటిలో హాయిగా వెచ్చగా వుండుట చేత నన్ను ఎగతాళి చేయుచున్నావు" అని చెప్పి ఆ పిచ్చుక గూడును పీకి ముక్కలు ముక్కలుగా చేసి పీకివేసెను. పాపము! పిచ్చుక వేరు గతి లేక గూటి నుంచి ఎగిరిపోయి కోతి వలె వర్షములో తడిసెను.

దుష్టులు మంచి సలహా గూడ అవమానముగా భావించి, మనకే అపకారము చేయుదురు. కాబట్టి దుష్టులకు ఎట్టి సలహాలను ఇవ్వరాదు. వారిని ఉపేక్షించి వారి జోలికి పోకుండా వుండుట మంచిది.

ఈ సూత్రము మనకు చక్కని నీతిని బోధించుచున్నది.

(స్వామి ముకుందానంద యోగదర్శనము నుండి)

# సార్వజనీనమైన మతము - నేడు దాని ఆవశ్యకత

మూలం : స్వామి శివానంద అనువాదం : గరిగిపాటి కృష్ణ

## హైందవీయము ధర్మమేకాని మతము కాదు

మతపరంగానైనా లేదా వేదాంత పరంగానైనా సార్వత్రికమను పదానికి అర్థం ఈ విశ్వములోని సర్వమతములకు చెందినవారు కొన్ని మూల సూత్రములను, అవి నైతికతకు సంబంధించినవైనా లేక ధార్మిక జీవనానికి చెందినవైనా తమకు చెందినవిగా భావించడం జరుగుతుంది.

దీనికి ఉదాహరణముగా, నేను హిందూ మతమును ఉటంకిస్తాను. హిందూ ధర్మము ప్రత్యేకంగా ఏ సూత్రములను విధించలేదు. అది హిందువులకు చెందిన మతము మరియు హిందువులంటే ఒక ప్రాంతమములో నివశించే వారిగా పిలవబడుతారు. ఈ "హిందూ" అన్న పదము, ఇండస్, సింధు ప్రాంతాలలో నివసించిన వారికి ఆపాదించబడినది. హిందూ మతానికి చెందిన సమాజం అంతర్గతంగా వేర్వేరు వేదాంతపరమైన సిద్ధాంతములనూ, విభిన్న మతపరమైన ఆచారములనూ, సంప్రదాయములనూ పాటిస్తూ వచ్చింది. (అవి బాహ్యామైనవి మాత్రమే ) అంతేకాక వారిలో వారు భిన్నమైన ఆలోచనా విధానం కలిగి ఉండేవారు. అయినప్పటికి, మూలంలో వారి గమ్యం ఒకటే అయి ఉండేది. ప్రాచీన హిందూ ఋషులు మనిషి మనసు యొక్క స్వభావమును గుర్తెరిగిన వార్తె, ప్రతి వ్యక్తి తాము యితరుల కంటే వేరని ఆలోచిస్తారని తలచినారు. అందుచేతనే వారు అనేక మార్గాలు ప్రస్తావించి, వాటి ద్వారా మనసును నిర్మూలించ వచ్చని భావితరాలకు మార్గ నిర్దేశనం గావించారు. అయితే మనసు లేకుండా పోతుందని కాదు. కాని మనిషి దాని ఉచ్చులో పడకుండా తన నిజతత్వాన్ని అనుభవించడమే. దీని వల్ల మనం గమనించాల్సినదేమిటంటే మానసిక స్థాయిలో ప్రతి వ్యక్తీ తనదైన రీతిలో ఆలోచిస్తాడు. అలాగే జీవిత సత్యాలను వివిధంగా అవగతం చేసుకుంటాడు. అంతేకాక తాను వేర్వేరు మత సిద్ధాంతాలను అనుసరిస్తూ తనదైన ప్రపంచంలో స్వేచ్ఛగా విహరిస్తాడు. కొన్ని పరిమితులకు లోబడి, సనాతన ధర్మం వ్యక్తి యొక్క స్వభావ, సమర్ధతల ననుసరించి తన్ను తాను ఉద్ధరించుకోడానికి కొంత వెసులుబాటు యివ్వడం జరిగింది. ఈ కారణం చేతనే మనకు ఈ ఒక్క హిందూ మతంలోనే అనేక రకాలైన ఆచార వ్యవహారాలు, నమ్మకాలు, లెక్కలేనన్ని జాతులు మరియు తెగలు అనేకమైన సిద్ధాంతాలు గోచరిస్తాయి. అయినప్పటికీ, హిందూమతం తన యొక్క విశిష్టతను యుగయుగాలుగా కాపాడుకుంటూ ఉంది. దీనికి ప్రధానమైన కారణం అది వ్యక్తి జీవనానికి మూల స్తంభములైన సత్యము, అహింస, సార్వజనీన దృక్పథము, అను ముఖ్య లక్షణములను (పాటిస్తూండడమే) విస్మరించక పోవడమే.

నేడు మనకు అత్యావశ్యకమైనది హిందూ మతము యొక్క పరిధిని విస్తరింపజేయడమే. సార్వజనీనత అనునది కూడా అన్ని ప్రపంచ మతములు యథాస్థితిలో కొనసాగుతూ వ్యక్తుల మానసిక పరిణతికోసమై కొన్ని ప్రాథమిక సూత్రములను విశ్వవ్యాప్తంగా, సమస్త మానవాళికి అనుసరణీయముగా ఉండేలా ప్రతిపాదించడమే.

అదృష్టవశాత్తు, ఈ మూల సూత్రములు అన్ని మతములలో ఇప్పటికీ మనకు స్పష్టంగా గోచరిస్తాయి. అన్ని మతములలోని మార్గదర్శక సూత్రములు, ఋజుప్రవర్తన, సత్య సంధత, ప్రేమ మరియు యితర దైవిక లక్షణములనే నిస్సంశయముగా బోధిస్తున్నాయి. ప్రతీమతము దైవము యొక్క ఉనికిని అంగీకరిస్తూనే, ఆ ప్రత్యేకమైన దైవాన్ని వేర్వేరు పేర్లతో సంబోధించడం జరుగుతుంది. పేరులో ఏమున్నది? అందువల్ల మనము నిజాయితీగానూ, తీవ్రంగాను, ఈ విషయమును శోధించిన యెడల సర్వమానవాళికీ ఆమోదయోగ్యమైన మూల సూత్రములు అన్ని మతములలోనూ దర్శనమిస్తాయి. దీనినే మనము సార్వ జనీనత అనవచ్చును. సార్వజనీనతను ఒక ప్రత్యేక మతంగా విశ్లేషించడం తగదు. మనము సార్వజనీన సమ్మతమైన విధానాన్ని అనుసరించడమంటే దాన్ని ఒక మతమనే చట్రములో బిగించకూడదు. ఎందువలనంటే అలా జరిగితే మనము ప్రపంచ మతాలకన్నింటికీ వేరుగా ఒక కొత్త మతమును స్థాపించినట్లే. దాని పరిణామం ఇంకొక మతమౌఢ్యసమాజాన్ని నిర్మించి విభేదములను పెంచడమే అవుతుంది.

ఈ సాధారణ మూల సూత్రములలోని ముఖ్యాంశములు యావత్తు మానవాళి నైతిక పరిపూర్ణత దిశగా అడుగులు వెయ్యడానికి ప్రయోజనకారులవుతాయనడంలో ఎట్టి సందేహము లేదు. అవి అన్ని మతములు తమ అనుయాయుల్ని పాటించమని ఆదేశించినవే ఇదొక్కడే సమస్యకు పరిష్కారము కాదు. మానవుని అంతరంగము ఎల్లప్పుడూ సత్యమూ, నిత్యమూ అయిన పరబ్రహ్మను గూర్చిన జ్ఞానమునకై అన్వేషిస్తూ ఉంటుంది. అయితే ఈ విచారణ జరిగేటప్పుడు ఎలా, ఎందుకు అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతాయి. ఈ ప్రశ్నలను తప్పించుకుంటే మానవుని ఆధ్యాత్మిక స్థాయి పెరుగుదల కుంటుపడుతుంది. అలాగే సార్వత్రికత యొక్క పునాదిరాళ్ళు పెకలించబడతాయి.

భగవంతుని ఏ పేరుతో పిలిచినా ఆయన ఉనికిని కాదనలేము. అందుచేత ఈ సార్వజనీన మతమనేది భగవంతుని పట్ల విశ్వాసమును కలిగించేలా ఉండాలి.

ఈ మూల సూత్రములను విశ్వవ్యాప్తంగా తీవ్రంగా ప్రచారము చేసిన యెడల అవి మానవాళిని మతపరంగా విభేదించుకోకుండా చేయడమే కాక, ఒక రకమైన మత సామరస్యమునకు దోహదపడతాయని చెప్పవచ్చును. ప్రతి వ్యక్తి తన మతాన్ని అనుసరిస్తూనే, వారిని సాధారణ మూల సూత్రముల గూర్చి జాగృతుల్ని చేయడం చాలా అవసరమని తోస్తుంది. ఎందుకంటే ఈ మూల సూత్రములు అన్నీ వారి వ్యక్తిగత మతములు ప్రబోధించనవే తప్ప వేరే మతములనుంచి తీసికొనబడలేదు.

విశ్వము నందు గల సర్వమానవాళి, సామరస్య వాతావరణముతోను, శాంతి యుతముగాను, అన్నదమ్ముల వలె కలిసిమెలిసి యుండుట అను సూత్రములు సర్వజనీనతయందు నిబిడీకృతమై యున్నవి. అదే మన ఆశయము. మనమిప్పటికి అయిదు మైలు రాళ్ళను అధిగించాము. ఆరవ మైలురాయి అన్నింటికన్నా అతి ప్రధానమైనదిగా భావించాలి. గమ్యం చేరువలోనే యున్నది. భగవంతుడు ప్రపంచ సమ్మేళనము విజయవంతము కావాలని ఆశీర్వదించు గాక! అలాగే ఈ సమ్మేళనమునకు సహకరించిన వారందరికీ భగవంతుని కృపా కటాక్షములు లభించుగాక!

ఓం శ్శాంతిః శ్శాంతిః శ్శాంతిః

# బ్రహ్మ వైవర్తపురాణములోని తులసి కథ - ఒక రాజకుమార్తె

జి.వి.యస్. సుబ్రహ్మణ్య శర్మ

## శ్రీమన్నారాయణుడినే నాభర్తగా ప్రసాదించుము

ఈ కథ పార్వతి పరమేశ్వరునకు చెప్పినది. దక్షిణ దేశములో "ధర్మధ్వజుడు" అను పేరుగల మహాప్రతాపశాలియైన ఒక రాజు ఉండెడివాడు. అతని భార్య పేరు మాధవి, సంతానమును పొందుటకొఱకై ఆ రాజు చిరకాలము తపస్సు చేసి భగవదనుగ్రహముచే ఒక కుమార్తెను పొందెను. ఆ కుమార్తెకు తులసి అని పేరు పెట్టినాడు. చిన్ననాటి నుండి ఆ తులసికి విష్ణుమూర్తిపైనను, ఆధ్యాత్మిక విషయములపైనను ఆసక్తి అధికముగా ఉండెడిది. ఆటలయందు కూడ ఆమె విష్ణు పూజలనే చేయుచు అతనికి ధూప, దీప హారతులను అర్పించుచుండెడిది. ఆ స్వామికి మ్రొక్కుచుండెడిది. కొన్నాళ్ళకు ఆ బాలికకు, విష్ణువునే భర్తగా పొందవలెనని దృఢమైన సంకల్పము కలిగినది. ఆ కోర్కె తీరుటకై ఆమె బ్రహ్మను గూర్చి తీవ్రమైన తపస్సును చేసినది. తన ఇంటి యందలి పూజా మందిరములోనున్న శ్రీవిష్ణు విగ్రహమును చూచిన ఆమెకు ఆయననే పరిణయమాడవలెనని కోర్కె ప్రబలమైనది. తపస్సులో సమాధి స్థితిలో నుండగా బ్రహ్మదేవుడు సాక్షాత్కరించి ఆమెను సమాధిస్థితి నుండి మామూలు స్థితికి తెచ్చుటకై తన కమండలములోని నీళ్ళను ఆమె పై చల్లెను.

### తులసి తపస్సు చేయుట

ఆమె అప్పుడు స్వస్థితికి వచ్చి ఎదుటనున్న బ్రహ్మకు సాష్టాంగపడినది. సంతసించిన ఆ బ్రహ్మ, ఆమెతో ఇట్లనెను. "తులసీ! నీ కేమి వరము కావలెనో కోరుకొనుము". అప్పుడు తులసి "శ్రీమన్నారాయణునే నా భర్తగా ప్రసాదింపుము అని బ్రహ్మను ప్రార్థించినది. బ్రహ్మ సమాధానముగా ఆ తులసితో ఇట్లనినాడు. "తులసీ! పూర్వము గోలోకమునందు గోపీరూపముతో శ్రీ కృష్ణుని వద్ద నీవు ఉండెడిదానవు. ఒకనాడు రాధాదేవి హఠాత్తుగా మీరిరువురు ఉన్నచోటికి వచ్చి చూచినది. కోపించి రాధ, తులసిని ఇట్లు శపించినది. "తులసీ! నీవు మనుష్య లోకమునందు మానవకాంతగా పుట్టుము. గోలోకములోనున్న సుదాముడు అను గోపాలుడు నిన్ను భార్యగా కోరుకొనుచున్నాడు. ఆ కోర్కెకు అనుగుణముగానే ఆసుదామగోపుడు కూడా భూలోకము నందు "శంఖచూడుడు" అను రాక్షసుడై పుట్టగలడు. ఆ శంఖచూడుడు ఆసురీగుణముతో దేవతలందరిని యుద్ధములో ఓడింపగలడు. ఆ విజయోత్సాహముతో తనకొక అందమైన భార్య కావలెనని లోకమంతయు కలియతిరుగగలడు. అట్లు తిరుగుచున్న ఆశంఖచూడుడు ఒకనాడు ఊహింపని ఒక పరిస్థితిలో, నిన్ను చూచి వెంటనే భార్యగా స్వీకరించును. మరికొంతకాలము తరువాత మరల దేవాసురులకు యుద్ధము జరుగును. ఆ యుద్ధములో శంఖచూడుడు అజేయుడుకాగా, దేవతలకు ఓడిపోవలసిన పరిస్థితి ఏర్పడును. అప్పుడు దేవతలందరూ బాగుగా ఆలోచించి, శంఖచూడుని భార్యయగు తులసి పాతివ్రత్యమును భంగపరచుటకై శ్రీమహావిష్ణువు ఒక్కడే తగినవాడని కూడా దేవతలు నిశ్చయించి అతనిని ప్రార్థించిరి. దేవతలకును, లోకమునకును మేలు జరుగునని తలచిన శ్రీ మహావిష్ణువు శంఖచూడుని రూపమును ధరించి, నీ భర్తగా నీ వద్దకు వచ్చును. ఆ వచ్చిన భర్త నిజమైన శంఖచూడుడే అనుకొని నీవు అతనిని పొందెదవు." అని చెప్పి బ్రహ్మ అంతార్ధాన మయ్యెను.

సుదామగోపుడే భూలోకమున శంఖచూడునిగా పుట్టి మహాపరాక్రమశాలియై దేవతలనందరిని ఓడించెను. ఇంద్రుడు మొదలగు దిక్పాలకులను జయించి, స్థానభ్రష్టులను చేసి తరిమివేసెను. అతని పరాక్రమమునకు భయపడిన దేవతలు ఆత్మ రక్షణకై రహస్యముగా అడవులలోనికి పోయి దాగుకొనిరి. ఆ తరువాత శంఖచూడుడు బ్రహ్మను గూర్చి తపస్సు చేసి, "తనకు మరణము లేకుండా వరము నిమ్మని ప్రార్థించెను దానికి బ్రహ్మ చెప్పిన సమాధానము ఇది. "శంఖచూడుడా! పతివ్రతయైన నీ భార్య యొక్క సతీత్వము భంగమైననాడు నీవు మరణించెదవు. అంతవరకు నిన్ను చంపు వీరుడు ఉండనేయుండడు" అని అంతార్ధాన మయ్యెను.

ఆ తరువాత ఆ వరగర్వముతో శంఖచూడుడు భార్యాన్వేషణమునకై లోకమంతయు కలయతిరుగుచు తులసి అను పేరుగల ఒక రాజకన్యను చూచి, తనను వివాహము చేసికొమ్మని ప్రాధేయపడెను. అందుల కంగీకరించిన తులసి, శంఖచూడుని గాంధర్వవిధిని అక్కడే అప్పుడే వివాహము చేసికొనెను. వివాహానంతరము తులసి, శంఖచూడులు మహా వైభవముగా రాజధానికి చేరుకొనిరి. ఆ తరువాత శంఖచూడుడు బ్రహ్మ వరమువలన కలిగిన గర్వముతో అకారణముగా దేవతలందరిని హింసించుచుండెను. అతని బాధలను పడలేక దేవతలు తమను రక్షింపుమని శ్రీమహావిష్ణువును ప్రార్థించిరి. విష్ణువు అందులకు అంగీకరించి, శంఖచూడుని మరణ రహస్యమును గుర్తించి, శంఖచూడుని రూపమును ధరించి, తులసి వద్దకు వెళ్ళెను. ఆ తులసి, వచ్చినవాడు తన భర్తయగు శంఖచూడుడే అనుకొని అతనితో విహరించెను. ఈ విధముగా తులసియొక్క పాతివ్రత్యము అంతఃపురములో భంగము కాగానే యుద్ధభూమిలో శివుడు తన చేతనున్న శూలముతో శంఖచూడుని సంహరించెను. శంఖచూడుని శవమును తన త్రిశూలముతో ఎత్తి శివుడు సముద్రములోనికి విసిరివేసెను. కొంతకాలమునకు ఆ శంఖచూడుని శరీరములోని ఎముకలే సముద్రములోని శంఖములుగా మారినవి. తన భర్త మరణించినాడని యద్ధభూమి నుండి వచ్చిన వార్తను అంతఃపురములోనున్న తులసి విన్నది. ముందుగా ఆశ్చర్యపడినది. ఆ తరువాత బాగుగా ఆలోచించిన తులసి తన ఎదుటనున్న శంఖచూడుని ముఖములోనికి పరీక్షగా, తీక్షణముగా చూచినది. ఇంకేమున్నది? ఎదుటనున్న శంఖచూడుని రూపము మాయమై, శ్రీమహావిష్ణువు అక్కడ నిలబడియుండెను. విష్ణువే భర్తరూపమున వచ్చి తనను మోసగించినాడు అని తెలిసికొనిన తులసి కోపించి, "పాషాణమైపోదువు గాక!" అని విష్ణువును శపించెను. ఆ శాపమును విన్న విష్ణువు గూడ తులసికి "నీవు కూడా గండకీనదిగా అవతరించుము. ఆ నదీ రూపమున ఉన్న నీలోనే నేను నీ శాపకారణముగా సాలగ్రామ శిలారూపమున ఉందును." అని ప్రతి శాపమునిచ్చెను.

ఆ తులసికి దహనసంస్కారము చేసిన తరువాత ఏర్పడిన చితాభస్మములో ఆమె కేశభాగము నుండి తులసీవృక్షము ఆవిర్భవించినది. ఇది బ్రహ్మవైవర్త పురాణములోని తులసి కథ. మానవకాంతగా తులసీ వివాహమును చెప్పిన కథ ఇది.

ఇక తులసి దేవతావృక్షమైనప్పుడు ఆమెకు, (ఆవృక్షమునకు) విష్ణుమూర్తి నిచ్చి వివాహము చేయు ఒక ఆచారము లోకములోనున్నది. దాని వివరములను కొంత తెలిసికొందుము.

# పిల్లల సూక్తులు

వి. శారద

## పిల్లలకు కూడ యుక్తాయుక్త వివేచన వుంటుంది

వ్యాస భగవానుడు వేదములను నాలుగుగా వ్యాసము చేసి తన శిష్యులచే జనులకు శ్రవణం చేయించాడు. ముక్తిని, మోక్షాన్ని కోరే మనుష్యులు తన వేదసారాన్ని వంట బట్టించుకొని, జీవనయాత్రను సఫలం చేసుకుంటారని ఆశించాడు. కాని గంభీరమైన వేద ఉపనిషత్తుల సారం సామాన్య ప్రజావాహినికి ఎక్కలేదు. తన ప్రయత్నం పూర్తిగా సఫలం కానందుకు వేదవ్యాసుడు చింతాక్రాంతుడయ్యాడు. నారద మహర్షి వ్యాసునికి పాఠంలా కాకుండా కథారూపంలో వేదసారము జనులకు అందించమని సలహాయిచ్చాడు. ఆ సలహాననుసరించి ఆవిర్భవించినవే మహాభారత, భాగవతములు. సంసార సముద్రాన్ని తరించి, మోక్షమార్గం చూపి, సామాన్యమానవునికి కూడ ముక్తి మోక్షం గురించి అవగాహన కల్పించేవే యీ గ్రంథాలు. భారతం ఉత్తమజీవనవిధానాన్ని వివరిస్తే, భాగవతం భక్తితో భగవత్సన్నిధిని చేరే మార్గం చూపెడుతుంది.భాగవతము పాఠకుల మనస్సులకు హత్తుకుని భక్తి పూలు పూయించి జ్ఞానవైరాగ్య ఫలములనిస్తుంది. ఇందులో పాత్రల ద్వారా లభించే వుపదేశాలు అక్షయములు. పామరుని గూడ ఆకట్టుకుంటాయి. ఈ ఉపదేశాలు యోగులు, ఋషులు, జ్ఞానుల నుండే గాక తమ పిల్లల నుండి గూడ తల్లిదండ్రులు పొందడం విశేషం. కథాగమనంలో యివి మనకి మంచి వివేచనను కలిగిస్తాయి.

వ్యాసుడు కఠోపనిషత్తులో నచికేతుని ద్వారా, పెడదారిన నడచుచున్న తండ్రిని సంస్కరించడానికి చేసిన యత్నం ఎంతో ప్రసిద్ధమైనది. సర్గఫలాలను కోరి విశ్వజిత్ యాగము చేసిన వాజశ్రవుడు తనకు అక్కరలేని, ఇచ్చిన వారికి వుపయోగపడని గోవులను ఋత్విక్కులకు దానమిస్తున్నాడు. ఆ దానాలు దాత వినాశనానికి కారణమౌతాయి. తండ్రి దోషాన్ని గ్రహించిన పసివాడైన నచికేతుడు తండ్రిని దోషం నుండి మరల్చాలని అనుకున్నాడు. తండ్రి ఆస్తి అయిన తనని ఎవరికి దాన మిస్తావని పదేపదే అడిగి విసిగించాడు. విసిగిన తండ్రి నచికేతుని మృత్యువుకు దానమిస్తానన్నాడు. తండ్రి మాట మీద నచికేతుడు యమపురికి ప్రయాణమయ్యాడు. దుఃఖిస్తున్న వాజశ్రవునికి నచికేతుడిలా ఉపదేశించాడు. “మన పూర్వీకులు అన్న మాటను తప్ప కూడదనే నీతికి కట్టుబడి ఉత్తమ గతిని పొందారు. ఆ ధర్మం నీవల్ల చెడకూడదు. అపసవ్యదానాలు చేసి యాగఫలం కోల్పోయిన నీవు, నీ పుత్రుని అయిన నన్నైనా అన్నమాట ప్రకారం యమునికి దానం చేసి యాగఫలం పొందు. లోకంలో మనుష్యులందరు మరణ స్వభావం కలవారు. భూమిపై పుట్టి, పెరిగి, నిలచిన పైరు ఎండిన తరువాత ఆ విత్తనం నుండి మరల మొక్క వచ్చినట్లు మరణించిన మనుష్యుడ్యు మరల జన్మిస్తాడు. మరణ సమయంలోని భావనలతోనే మరల పుడతాడు. చావు పుట్టుకలేనిదారిని వెతుకుటయే తెలివి గలవారు చేయవలసినది” అని తండ్రికి బోధ చేసి యముని వద్దకు వెళ్ళి, యముని తన ప్రశ్నలతో మెప్పించాడు.

భాగవతము భగవంతుని గూర్చి వివరించే గ్రంథము. భగవానుడైన శ్రీమహావిష్ణువు యొక్క గుణగుణాలను, మహిమలను అవతార లీలలను వెల్లడిస్తుంది. కర్దమ దేవహూతులకు విష్ణు అంశ అయిన కపిలుడు జన్మించాడు. సంసార బాధ్యతలను పూర్తిచేసిన కర్దముడు సన్యసించాడు. కపిలుడు విష్ణు అంశ అని తెలుసుకున్న దేవహూతి తనకు జ్ఞాన బోధ చేసి జన్మరాహిత్యమును కలిగించమని వేడుకుంటుంది. కపిలుడు తల్లికి మోక్షాన్ని యిచ్చే భక్తిని, ప్రకృతి జ్ఞానమును బోధించాడు. "మానవులు ఆత్మ నిష్ఠ వలన ద్వంద్వవిముక్తి కలిగి మోక్షమును పొందగలరు. మనోనిగ్రహము వలన భక్తి వైరాగ్యములు కలిగి జ్ఞానాసక్తి కలిగి ఆత్మ విచారణ మొదలగును. సత్సంగము వలన మోక్షము నందు శ్రద్ధ, భక్తి, ప్రేమ కలుగును. జ్ఞాన వైరాగ్యములకు యోగసాధనతో భక్తి కలిసిన యీ జన్మము నందే ముక్తి కలుగును. భగవంతుని ఆత్మ స్వరూపునిగా తలచి ప్రేమించి, పుత్రునివలె కాపాడి, మిత్రుని వలె నమ్మి, గురువు వలె గౌరవించి, ఇష్ట దైవముగా ఆరాధించి శరణు పొందిన వారికి నాశనము లేదు. ప్రకృతి లక్షణములు తెలిసినచో మానవుడు త్రిగుణముల నుండి విముక్తుడగును. ద్వంద్వ ప్రవృత్తిలో పురుషుడు ప్రకృతికర్మలకు తనను కర్తగా తలచుచు అజ్ఞానముచే జననమరణ చక్రమున పడుచున్నాడు. ప్రకృతి కార్యములు 24 తత్వములు కదలికకు కారణమైన భగవానుడే కాలము. ప్రకృతి యందు ప్రకటమయ్యే చైతన్య శక్తే మహాతత్వము. శబ్దము నుండి ఆకాశము, ఆకాశము నుండి వాయువు, దాని నుండి రూపము, దానిచే రసము, రసము నుండి గంధము పుట్టినవి. ఇంద్రియ మార్గములలో తగుల్కొనిన మనస్సును భక్తి వైరాగ్యములచే వశము చేసుకొనవలెను. సాధకుడు సర్వప్రాణులందు బ్రహ్మని గాంచుచు, సంసారాసక్తి విడచి, బ్రహ్మచారియై, మౌనియై కర్తవ్యములను చేయుచుండవలెను. కపిలుడు తల్లికి మనస్సు నిర్మలమగుటకు ప్రాణాయామము, అష్టాంగ యోగము, భక్తిలోని మర్మములు, భక్తులలోని భేదములు, కాల మహిమను తెలిపెను. ఐదు కర్మేంద్రియములు, ఐదు జ్ఞానేంద్రియములు, మనస్సు కలిపి ప్రకటితమయిన ఆ పరబ్రహ్మయే హిరణ్య గర్భుడు వ్యష్టి జీవుడు – సమిష్టి పురుషుడు. ఈ బ్రహ్మాండము ఆ పరబ్రహ్మము నుండియే ప్రకటిత మయినది. పూజ, క్రతువులు, దానములు, తపస్సు, వేదాధ్యయనము, వేదతాత్పర్యవిచారము, మనస్సును యింద్రియములను జయించుట సర్వకర్మసంన్యాసము , ఎనిమిది అంగములతో కూడిన యోగము భక్తి యోగము సకామ, నిష్కామ ధర్మము, నిత్యానిత్యవస్తువివేకము దృఢమగు వైరాగ్యము అను సాధనములన్నియు భగత్ప్రాప్తికి తోడ్పడును. అజ్ఞానము వల్ల కలిగే కర్మలు జీవునకు అనేక గతులను కలిగించును. వాటిని పొందుచున్న స్వస్వరూపమును తెలియకున్నాడు." అంటూ కపిలుడు వివిధ విషయములను తల్లికి ఉపదేశించాడు.

ఆదివరాహమూర్తి హిరణ్యాక్షుని వధించి భూదేవిని యథా స్థానంలో వుంచాడు. హిరణ్య కశిపునికి తమ్ముడు నిహతుడవ్వడం క్రోధమును, దుఃఖమును తాపమును కలిగించినవి. కడుపు శోకంతో వున్న తన తల్లి దితిని యిలా ఓదార్చాడు. రాక్షసరాజైనా కూడ హిరణ్య కశిపుడు తల్లికి యిలా వేదాంతం చెప్పాడు. "ప్రారబ్ధవశముచే ప్రాణులు కలిసి విడిపోవుదురు. చలివేంద్రములో కలసిన వ్యక్తులవలె యీ లోకములో జీవులు కూడుదురు. కనుక సంగమము కూడదు. ఆత్మ కాలమునకు అతీతమైనది, నశింపనిది, పాపపుణ్యములంటనిది, సర్వ వ్యాప్తి, సర్వజ్ఞ, ప్రకృతికి అతీతము. మనస్సు చలించినపుడు వికారము లేని దైననూ ఆత్మ వికారము

కలిగినట్లు కనిపించును ఆత్మ దేహముతో కలయకున్నను అధ్యాస వలన ప్రియ–అప్రియ, సంయోగవియోగములు కలదిగా, కర్తగా, కర్మఫలములను అనుభవించేదిగా, జనన మరణములు కలదిగా, అవివేకిగా అగుచున్నదని విదులు అందురు. నిత్యమగు ఆత్మ గురించి కాని అనిత్యమగు దేహమును గురించి గాని శోకించుట వ్యర్ధము. స్వపర దురభిమానము వుండుటయే అజ్ఞానము". అని తల్లికి ప్రేతబంధు యమసంవాదము గూర్చి తెలిపెను.

విష్ణుద్వేషి అయిన హిరణ్య కశ్యపునికి పుత్రుడు హరిభక్తుడైన ప్రహ్లాదుడు తన మతమునకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్న కుమారుని హిరణ్యకశిపుడు నీ దిక్కు ఎవరిని ప్రశ్నించాడు. ఏ బలముతో తన శాసన వుల్లంఘన చేస్తున్నావని నిలదీశాడు. బాల ప్రహ్లాదుడు యీ విధముగా తన బలమును వివరించాడు. బలవంతులకు బలముగా నున్నవాడే బలహీనులకు కూడా బలముగా నున్నాడు. బ్రహ్మ మొదలుగా గల దేవతలకు, సృష్టిలోని సకల ప్రాణులకు అందరికీ అతనే బలమిచ్చువాడు. ఆధారము వున్నదనుకొనిన వారికి, లేదనుకొనువారికి కూడా అతనే దిక్కు. అట్టి విష్ణువే నాకు దిక్కు. విష్ణువునకు సాటియగు వాడు గాని, అధికుడు గాని లేడు. దిక్కులకు, కాలానికి అతీతుడైన వాడెవడో, అన్ని దిక్కులకు మూలమై వున్నవాడు, దిక్కు వున్న వారికి దిక్కులేని వారికి దిక్కైన వాడు నాకు దిక్కు. సముద్రములో, వాయువులో, ఆకాశములో భూమి యందు, అగ్ని యందు, దిక్కులలో రాత్రింబగళ్ళలో సూర్య చంద్రులలో, ఓంకారములో త్రిమూర్తులలో స్త్రీనపుంసక వ్యక్తులలో ఈశ్వరుడంతటా వున్నాడు. ఎక్కడున్నాడనే అనుమానం వద్దు. ఎక్కడ వెదికితే అక్కడే వున్నాడనే విష్ణువ్యాపకత్వం వివరించాడు. బ్రహ్మ మొదలు స్థావర జంగమములన్నియు శ్రీహరి వశమే. అతడు కాలరూపుడు. ప్రాణులలోని యింద్రియ శక్తి, మనశ్శక్తి, ధైర్యము, దేహశక్తులకు మూలము ఆత్మయైన ఈశ్వరుడే. త్రిగుణాత్మక జగత్తును మాయా శక్తితో సృష్టించి, రక్షించి, ఉపసంహరించుచున్నాడు. విష్ణుద్వేష భావనను విడచి రాగద్వేషాతీతుడవు కమ్ము. అదియే అనంతారాధన. వశములో లేని మనసే ప్రథమ శత్రువు. మన సర్వస్వమును హరించు అరిషడ్వర్గములే అంతఃశత్రువులు. ఈ శత్రువులను జయించనచో పది దిక్కులను జయించినను లాభము లేదు. మనస్సును జయించనిచో పది దిక్కులను జయించినను లాభము లేదు. మనస్సును జయించిన వానికి శత్రువులుండరు. స్వపర భేద వ్యామోహమే వ్యక్తికి శత్రువు. సమస్త భూతములందును సమభావము కలిగి యుండుము. లోకము లన్నింటిని జయించినను నీయందలి ఆరుగురు శత్రువులను జయించలేకపోతివి. నీవు చేసిన కర్మలే నిన్ను బంధించుచున్నవని తెలుసుకొని, సంసార బంధమును వదలి వేయుము. చిత్తానికి భయపడి దానికి దాస్యము చేయకూడదు. విష్ణుభక్తిని హృదయమున నిలుపుకొనుటే దీనికి నివారణోపాయము. నీకు అందరు భయపడి నీకు హితము చెప్పక, నీకు హితమైనదే చెప్పుచున్నారు అని తండ్రికి బోధించెను.

అలనాటి వ్యాసరచనలలోనే కాక, ప్రస్తుత ఆధునిక వైజ్ఞానిక కాలంలో కూడా పిల్లలు పెద్దల కన్న బుద్ధికుశలతతో వుండడం గమనిస్తూనే వున్నాము. మన అభిజాత్యాన్ని వెనుకకు నెట్టి సందర్భాన్ని బట్టి పిల్లల మాట వినడం యుక్తమే. వారి సలహాలు కూడ అనుసరణీయాలే. ఈ విషయం పెద్దలు (వయసులో) తమ వివేచన, విచక్షణ అనుసరించి ఆలోచించగలరని చిన్న విన్నపం.

(వ్యాస భాగవతము నుండి)

# సోమరి మీనా

స్వామి చిన్మయానంద

## సోమరితనం వద్దు

ఒకానొకప్పుడు మీనా అనే బాలిక ఉండేది. ఆ అమ్మాయి ఏ పనీ చేయకుండా సోమరిగా తిరుగుతుండేది. ఎప్పుడూ అందమైన దుస్తులు ధరించాలని, బంగారపు నగలతో అలంకరించుకోవాలని, నవ్వుతూ అందంగా సంతోషంగా బొమ్మలా ఆకర్షణీయంగా ఉండాలని, అనుకుంటుండేది. తరచుగా తల్లి మీనాతో, అసలైన అందం పనిచేయడములోనే ఉంటుందని హితపు చెప్తుండేది. మీనా మాత్రం తల్లి మాటలను పెడచెవిని పెట్టేది. తల్లి ఎప్పుడైనా పనిలో సహాయం చేయమని అడిగినప్పుడు, తల్లి మాటలు వినబడనట్లుగా నటించి పనిచేయకుండా తప్పించుకునేది.

చివరకు మీనా తల్లికి విసుగు కలిగి, ఓ భగవంతుడా! మీనాకు సోమరితనం ఎంత చెడ్డదో తెలిసేలా చేయి అని ప్రార్థించి. వెంటనే మీనా తల్లితో, అమ్మా! నువ్వు ఎంత అమాయకురాలివి. ఏ పనిచేయకుండా ఉంటే ఎంత హాయిగా ఉంటుందో తెలుసా? భగవంతుని ఏ విధంగా ప్రార్థించాలో నీకు తెలియదు. నేను ఇప్పుడు భగవంతుని ప్రార్థిస్తాను అని చెప్పింది.

వెంటనే మీనా "ఓ భగవంతుడా! నాకు ఏ పనీ చేయవలసిన అవసరము లేకుండా అన్ని పనులూ వాటంతట అవే జరిగిపోయేలా చూడు" అని కళ్ళు మూసుకొని కపటభక్తిని ప్రదర్శిస్తూ ప్రార్థన చేసింది. ఇటువంటి చెడు ప్రార్థన భగవంతునికి చికాకు కలిగించింది. అయినా మీనాకు గుణపాఠము నేర్పాలని మీనా కలలో కనపడి భగవంతుడు, "ఓ మీనా! నీ కోరిక నెరవేరుతుంది. ఏ పనిచేయకుండానే నీ పనులన్నీ వాటంతట అవే జరిగిపోతాయని"ని చెప్పి అంతర్ధానమైపోయాడు. మీనాకు సంతోషం హద్దులు లేకుండా పోయింది.

మరునాడు ఉదయము నిద్రనుండి లేవగానే రాత్రి వచ్చిన కల నిజమౌతుందా అని అనుమానమొచ్చింది. మంచం మీద నుంచి లేవగానే, మంచం మీద ఉన్న దుప్పటి ఒక్కసారి గాలిలోకి ఎగిరి దుమ్ము దులుపుకుని తిరిగి ప్రక్కమీద అందంగా పరచబడింది. ఆహా! కల నిజమైనదని సంతోషించింది. మీనా ఆనందాన్ని పట్టలేకపోయింది. స్నానాల గదిలో ప్రవేశించగానే పండ్లు తోముకునే బ్రష్ టూత్ పేస్ట్ ట్యూబ్ దానంతటదే తెరుచుకుని టూత్‌బ్రష్‌పై పడింది. ఆ టూత్‌బ్రష్ ఎగురుకుంటూ నోటిదగ్గరకు వచ్చి పళ్ళను శుభ్రం చేసింది. నీళ్ళు చిన్నధారగా వచ్చి నోటిని పూర్తిగా కడిగింది. ఎంత బాగుంది. మీనా నోరు తెరవడము తప్ప ఏమీ చేయవలసిన అవసరము లేకపోయింది. ఇంట్లోనే చేయవలసి హోంవర్కు దానంతటదే పూర్తి అయ్యింది. కాళ్ళకి తొడుగు కొనే జోళ్ళు, స్కూలుకు వెళ్ళే దుస్తులు అన్నీ శుభ్రం చేయబడి సిద్ధంగా వున్నాయి. మీనా ఉక్కిరిబిక్కిరి అయిపోయింది. వేడినీళ్ళు తీసుకువెళ్ళకుండానే స్నానాల గదిలో సిద్ధంగా ఉన్నాయి ఎంత ఆశ్చర్యం! స్నానం

చేద్దామనుకునే లోపుగా వేడినీళ్ళు పైకి ఎగురు కుంటూ వచ్చి మీనా వీపు మీద పడ్డాయి. వేడిగా ఉన్నాయి, చల్లటి నీళ్ళు వచ్చేవరకు ఆగు అని చెప్పినా లాభం లేకపోయింది. వేడి నీళ్ళు ఆగకుండా పడుతుండడం వలన వచ్చిన బాధను భరించలేక, గదినుండి బయటకు పరుగెత్తింది. బయటకు రాగానే నిన్న ఉపయోగించిన బట్టలు ఎగురుకుంటూ వచ్చి మీనా శరీరం మీద పడ్డాయి. మీనా ఆ పాత బట్టలను చూచి అసహ్యించుకుంది. నాకు వద్దు అని ఎంత అరచినా ఉపయోగం లేకపోయింది. వాటిని లాగుదామని ప్రయత్నం చేస్తే ఊడిరాలేదు.

నేనీ పాతబట్టలతో ఏ విధంగా స్కూలుకు వెళ్ళడం అని బాధపడింది. అక్కడ అందరూ నవ్వుతారే అని మీనా ఏడవడం ప్రారంభించింది. భోజనాల గదిలోకి మీనా పాత బట్టలతో రావడం చూసి మీనా తల్లి ఆశ్చర్యపడింది. ఎందుకు ఇటువంటి పాతబట్టలు వేసుకున్నావని తల్లి అడగగానే మీనా ముఖము ఎర్రబడింది. పని చేయకూడదు అనే కోరిక పూర్తిగా నెరవేరలేదు.

పైగా దీనివలన ఆనందం కూడా రావడం లేదు. భోజనం చేద్దామని తలంచగానే తాను ఏమీ కష్టపడకుండానే అన్నం, పప్పు, సాంబారు అన్నీ కలిపి పెద్ద ముద్దలుగా తయారై ఒకదాని వెనుక ఒకటి నోటిలోనికి రావడము ప్రారంభించాయి. మీనాకు దేనికి దానికి విడివిడిగా కలుపుకుని తినడము అలవాటు. ముద్దలు నమిలి మ్రింగడానికి కావలసిన సమయం లేకుండా వచ్చేస్తున్నాయి. ముద్దలు రావడం ఆగడం లేదు. సమయానికి నోరు తెరువక పోతే ముద్దలు వచ్చి ముక్కు మీద బుగ్గల మీద పడి ముఖమంతా వికృతంగా తయారైంది. మ్రింగడం కష్టంగా ఉందని మంచి నీళ్ళు త్రాగుదామని చెయ్యి చాపింది. మంచినీళ్ళు గ్లాసు ఒక్కసారి ఎగిరి తన నోటి వద్దకు వచ్చి ముఖం మీద, బట్టల మీద, తలమీదపడ్డాయి. ఈ రోజు ఏం జరిగింది మీనా? అని తల్లి కోపంతో అరిచింది. శుచిగా భోజనం చేయాలని తెలియదా అని అడిగింది. మీనా కళ్ళనీళ్ళు పెట్టుకుంటూనే భోజనం ముగించింది. మళ్ళీ తలదువ్వుకునేటప్పుడు కష్టాలు ప్రారంభమయ్యాయి. అరగంట సేపు తల దువ్వుకుని అందంగా రెండు జడలు వేసుకోవడం మీనాకు అలవాటు. చిగురున రిబ్బనులతో అందంగా ముడి వేసుకునేది. తనతోటి పిల్లలంతా మీనా నల్లని ఉంగరాలు తిరిగి ఒత్తుగా ఉన్న జుట్టును చూచి చాలా మెచ్చుకునే వారు. కాని ఈ రోజు దువ్వెన దానంతట అదే పైకి లేచి మీనా జుట్టు దువ్వి మసలివారు వేసుకునే ముడివేసింది. మీనా ఎంతగానో బాధపడింది. ఇటువంటి ముడివద్దు నాకు జడలే కావాలి. అని ఎంతగా అరచినా ఏమీ ఉపయోగం లేకపోయింది. చేసేది లేక అలాగే స్కూలుకు వెళ్ళింది. ఇప్పుడు మీనా ముసలి పనిమనిషిలా ఉంది అంటూ స్నేహితులందరూ వింతగా చూస్తున్నారు. అందరూ దీనికి కారణం ఏమిటని అడుగుతున్నారు. మీనా నిజం చెప్పడానికి సాహసించలేకపోయింది. సోమరిగా ఉండడము తనకిష్టంగానే ఉంది. కాని దాని వలన బాధలెక్కువయ్యాయి.

ఇంకా ఇంకా కష్టాలు వచ్చిపడుతున్నాయి మీనాకు. గంటకొట్టి తరగతులు ప్రారంభించారు. కాని నోట్సులు వ్రాయలేక పోతోంది. నోట్సు పుస్తకాలు వాటంతట అవే తెరుచుకున్నాయి. సిరాబుడ్డి పైకి లేచి నాట్యం చేయడం ప్రారంభించింది. సిరాను అచ్చు పుస్తకాలపై చల్లింది. అందులోని కలం అన్ని పుస్తకాలపై పిచ్చి గీతలు గీసింది. అటువంటి పని చేయవద్దు నా పుస్తకాలన్ని పాడుచేస్తున్నావు అని ఎంత చెప్పినా వినడం లేదు.

ఉపాధ్యాయుడు ఈ పాడు పనికి మీనాను తిట్టడం ప్రారంభించాడు. లెక్కల మాస్టారు బాగా చీవాట్లు పెట్టాడు లెక్కచేయడానికి బదులు ఆ కలము, పాటలు వ్రాస్తోంది. మీనా ఎంతో తెలివైనది. ఇంతవరకు ఎప్పుడూ శిక్ష అనుభవించలేదు. బల్లపై నిలుచోమని ఉపాధ్యాయుడు గద్దించాడు. అందరూ తనని చూచి నవ్వుతుంటే మీనా తలవంచుకోవలసి వచ్చింది. ఎంత సిగ్గుచేటు, విశ్రాంతి సమయంలో సిగ్గుతో ఎవరినీ కలుసుకుని మాట్లాడలేకపోయింది. ఒక చెరువుగట్టు మీద కూర్చుని ఏడుస్తోంది. జరిగిన దానిని తలుచుకుని ఆ చెరువులోని నీళ్ళను కదిలిస్తోంది. ఆ నీళ్ళు ఒక్కసారి పైకి లేచి మీనాపై బడి బట్టలన్నీ తడిపేశాయి. చలితో వణికిపోతోంది. అక్కడే ఉన్న ఊయల బల్లపై కూర్చుని ఊగడం ప్రారంభించింది. ఉయ్యాల తనంతట తానే ఊగుతోంది. అంత ఎత్తుకు వద్దు అని ఎంత వారించినా లాభం లేకపోయింది. ఆ ఉయ్యాల ఇంకా ఇంకా పైకి ఊగడం ప్రారంభించింది. వేగంగా ఊగడం వలన చేతులు పట్టుతప్పి మీనా క్రింద పడిపోయింది. మీనాకు బాగా దెబ్బలు తగిలాయి.

సోమరితనం మంచిది కాదని తల్లి ఎందుకు చెప్పిందో ఇప్పుడు మీనాకు అర్థమైనది. అన్నీ వాటంతట అవే జరిగిపోతుండడమువలన ఆనందం కలగడం లేదు. ఆడుకోవడం కుదరలేదు. తినడం, దుస్తులు ధరించడం కుదరడం లేదు.

తానొక చెడ్డ బాలికగా చిత్రించుకుంది. ఓ భగవంతుడా! నేను ఇదివరకు మాదిరిగా ఉండాలి. సోమరితనం వద్దు. దీనివలన గుణపాఠం నేర్చుకున్నాను అని భగవంతుని ప్రార్థించింది. భగవంతుడు సంతోషించాడు. భగవంతుడు తను ఇచ్చిన వరాన్ని వెనుకకు తీసుకున్నాడు.

ఇప్పుడు పనులు వాటంతట అవే జరిగిపోవడం లేదు. మీనా సంతోషంగా ఉంది. తన పనులు తానే చేసుకుంటోంది. ఇప్పుడు మీనా సోమరితనం ఎక్కడకో పోయింది.

(చిన్మయా మిషన్ సౌజన్యంతో)

- దేనికైనను నశింపజేయవచ్చును గాని జన్మతహ (ఆ జన్మంతరముగా) వచ్చుచున్న ఈ 'అహం' కారమును నశింపజేయుట దుర్లభము. అయినను తరించుటకు ఒక మార్గము కలదు. అది జ్ఞానాగ్నిలో ఆ అహంకారమును దగ్ధమొనర్చుటయే.

  – స్వామి ఓంకార్

- కర్మఫలం ఆత్మను ఎన్నడూ అంటదు. ఆకాశంలో మేఘాల ఘర్షణ వలన కలిగిన ఉరుములు–మెరుపులు–శబ్దం ఆకాశాన్ని అంటవుకదా? మనం ఆత్మ శక్తి నుండి విడిగా లేమని – మనం అందులో అంతర్లీనంగా వున్న ఒక భాగమని తెలిసినప్పుడు మనం తికమక పడడానికి కారణమే కనిపించదు.

  – శ్రీ భగవాన్ రమణ మహర్షి

- ధనం వల్ల, పేరు ప్రతిష్ఠల వల్ల, ఎటువంటి ప్రయోజనము లేదు. మంచి శీలం మాత్రమే దుస్సాధ్యమైన కష్టాల అడ్డుగోడల్ని పగులగొట్టుకుని ముందుకు చొచ్చుకు పోతుంది.

  – స్వామి వివేకానంద

# విజ్ఞప్తి - గోసంతతికై గోశాల విస్తరణ

**నమోదేవ్యై మహాదేవ్యై సురభ్యై చ నమో నమః । గవాం బీజ స్వరూపాయై నమస్తే జగదంబికే॥**
**మహాదేవీ, గోబీజ స్వరూపిణి, జగదంబికా । సురభిమాతా, నీకు నమస్కరించు చున్నాను.**

ప్రేమమూర్తులైన, ఆశ్రమ భక్తులకు పూజ్య స్వామి ఓంకార్ మరియు మాతాజీ వారి యొక్క దివ్య ఆశీస్సులు.

మీ అందరి సహకార సంపత్తులతో, ఆశ్రమంలో తలపెట్టిన బృహత్ పథకం అయిన "గోశాల మరియు కృష్ణమందిరం నిర్మాణం", విజయవంతంగా పూర్తి అయ్యి మార్చి నెలలో పూజ్య మాతాజీ దివ్య హస్తములతో ఘనంగా ప్రారంభమయిన విషయం మీ అందరికీ ఇదివరలో పత్రికా ముఖంగా తెలియపరచడమైనది.

ఈ గోశాల నిర్మాణం వలన గోవులు, లేగదూడలు ఎంతో సౌకర్యంగా, ఆరోగ్యకరంగా ఉంటున్నాయని తెలుపుటకు చాలా ఆనందంగా వుంది. ఇందుకు గాను సహకరించిన సహృదయులు అయిన భక్తులు అందరికీ మరొక్కసారి కృతజ్ఞతలు మరియు ఆశీస్సులు.

గత సంవత్సర కాలంగా సంఖ్యాపరంగా పెరిగిన లేగదూడలు ఉండుటకు, సేద తీరి పచ్చిక మేయుటకు, వాటికి ప్రత్యేకంగా, కొంత విశాల ఆవరణతో కూడిన చిన్న షేడ్ నిర్మాణం అవశ్యం అనిపించింది.

ఈ ప్రతిపాదనలో, 100' × 50' అడుగుల కొలతలు గలిగి, ప్రహారి గోడ, గేటుతో కూడిన ఒక విశాల ఆవరణ, అందులో 20'×40' సైజు గల, ఒక రేకుల షెడ్ మరియు చిన్న నీటి తొట్టి నిర్మించాలని తలపెట్టడం అయ్యింది.

ఈ ప్రతిపాదనకు సుమారుగా రూ.6.50 లక్షలు కాగలదని అంచనా వేయడం అయ్యింది.

ఈ బృహత్కర నిర్మాణంలో భాగస్వాములు కాదలచిన ఆశ్రమ భక్తులు, ఔత్సాహిక ఆశ్రమ భక్తులు, ఔత్సాహిక దాతలు విరాళములు ధనరూపంలో/చెక్కు/ ఎస్.బి.ఐ. కత్తిపూడి అకౌంట్ నెం. 11003309435కు ఆన్‌లైన్ ద్వారా శ్రీ శాంతి ఆశ్రమం పేరున పంపగలరని విజ్ఞప్తి. మీరు ఏ విధంగా విరాళము పంపినను వ్రాత పూర్వకముగా లేదా ఇమైల్ ద్వారా లేదా మొబైల్ నంబరు 7382009962కు మీ పేరు, చిరునామా మీ మొబైల్ నంబరు తెలుపగలరు. మీ విరాళములకు సెక్షన్ 80జి ప్రకారము ఆదాయపు పన్ను మినహాయింపు కలదు. రూ. 10,000/-కు పైన ఇచ్చిన దాతల పేర్లు శిలాఫలకము మీద వ్రాయబడును. ఈ బృహత్తర కార్యక్రమంలో వారి వారి శక్త్యానుసారము సహకరించవలసినదిగా మా విన్నపము.

ఓం తత్ సత్

గురుసేవలో
**వినమ్రానంద సరస్వతి**

# దాతలకు విజ్ఞప్తి

దివ్యాత్మ స్వరూపులకు సూచన. శ్రీ శాంతి ఆశ్రమమునకు విరాళము ధన రూపంలో / చెక్కు / ఎస్.బి.ఐ, కత్తిపూడి, అకౌంట్ నెం. 11003309435కు ఆన్‌లైన్ ద్వారా పంపగలరు. మీ విరాళములకు ఇన్‌కమ్‌ట్యాక్స్ 80జి రాయితీ కలదు. మీరు ఏ విధంగా విరాళము పంపినను వ్రాత పూర్వకంగా లేదా ఇమైయిల్ ద్వారా లేదా మొబైల్ నంబరు 7382009962కు మీ పేరు, చిరునామా మీ మొబైల్ నంబరు తెలుపగలరు.

# శాంతి పత్రిక చందాదారులకు విజ్ఞప్తి

శాంతి పత్రిక ప్రతినెలా 1,2 & 3 తేదీలలో పోస్టు చేయబడును.

సం॥ర చందా రూ. 100/-, జీవిత చందా రూ. 1000/- (12 సంవత్సరముల వరకు మాత్రమే), ఎమ్.ఓ/స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కత్తిపూడి అకౌంట్ నెం. 11003309435, ఆన్‌లైన్ ద్వారా ఈ క్రింది చిరునామాకు పంపగలరు.

ఎమ్.ఓ.ఫారమ్‌లో దిగువ ఫర్ కమ్యూనికేషన్ భాగములో మీ పూర్తి చిరునామా వ్రాయాలి. తదుపరి క్రొత్త చందా లేక పాత చందా అనునది క్లుప్తముగా వ్రాయాలి. పాత చందా అయితే చందాదారు సంఖ్య వ్రాయాలి.

చందాకాలం ముగింపుకు నెలముందే రెన్యువల్ చేసుకొనవలెను. మీ అడ్రస్ మార్పు జరిగితే, ఉత్తరము ద్వారా తెలుపుతూ చందా నెంబరు వ్రాయాలి. చందా వివరములు తెలుపని యెడల సొమ్ము విరాళముగా జమచేయబడును.

కార్యదర్శి, శ్రీ శాంతి ఆశ్రమం (పోస్ట్)

వయా శంఖవరం - 533 446, తూ.గో.జిల్లా

# విన్నపము

విదేశములలో వుండు ఆశ్రమ భక్తులు విరాళములు ఈ క్రింది ఎఫ్.సి.ఆర్.ఎ (Foreign Contributions Regulation Act) బ్యాంక్ అకౌంట్‌కు తమ యొక్క నివసించే ప్రాంతములోని తమ బ్యాంక్ అకౌంట్ నుండి ఆదేశ కరెన్సీలో పంపగలరు. పంపిన పిదప వివరములు srisanthiashram@gmail.com అనే మెయిల్ ఐడికి మరియు mattavvs07@gmail.com కి తప్పకుండా పంపవలెను.

బ్యాంకు పేరు : State Bank of India, 11 Sansad Marg, New Delhi-110001
A/c Name : THE MISSION OF PEACE - FCRA A/c No : 40127798428
Swift Code : SBININBB104

**1. మాతృ ఆశ్రమం**
శ్రీ శాంతి ఆశ్రమము
తోటపల్లి కొండలు, పిన్ : 533 446.
వయా శంఖవరం, తూ.గో.జిల్లా.
సెల్ : 7382009962
రిసెప్షన్ : 6305349677
e-mail : srisanthiashram@gmail.com

**2. విశాఖ : శాంతి ఆశ్రమము**
లాసన్స్‌బే, పెదవాల్తేరు - 530 017
విశాఖపట్నం.
ఫోన్ : 0891 - 2538689
e-mail : srisanthiashramvsp@gmail.com

**3. విశ్వశాంతి క్షేత్రం**
కైలాసగిరి, విశాఖపట్నం

**4. కోటగిరి శాఖ**
పీస్ సెంటర్, డార్‌మోనా రోడ్,
కోటగిరి - 643217, నిలగిరి జిల్లా.
తమిళనాడు.
ఫోన్ : 04266-271945
e-mail : vsvmsktg@yahoo.com
vsvmsktg@gmail.com

**5. కాకినాడ శాఖ**
శాంతి ఆశ్రమము, అశోక్ నగర్
కాకినాడ - 533 004.
తూ.గో.జిల్లా

**6. పిఠాపురం శాఖ**
స్టువర్టు పేట,
పిఠాపురం-533 450. తూ.గో.జిల్లా.

**Website : www.srisantiashram.org**

# దైవ సాయుజ్యము

**తేది 27-06-2021** ఆశ్రమ శ్రేయోభిలాషులు, భక్తులు మరియు ఆశ్రమానికి వైద్యసహాయం అందిస్తున్న శ్రీ ఎమ్.వి. ఆంజనేయులు గారు, నర్సారావు పేట వాస్తవ్యులు. వీరి కుమారుడు **శ్రీ వీరంబొట్లు గుప్త గారు** వారి వారి స్వగృహము నందు దైవసాయుజ్యము పొందిరి.

**తేది. 02-07-2021** ఆశ్రమవాసులైన శ్రీమతి దాసరి శేషారత్నం గారి అమ్మాయి **శ్రీమతి దాసరి పద్మగారు** వారి స్వగృహము నందు దైవసాయుజ్యము పొందిరి. వీరు ఆశ్రమానికి విద్య వైద్య సహాయములను ఏంతో భక్తి ప్రేమ పూర్వకముగా అందించారు.

**తేది. 04-07-2021** చెన్నై వాస్తవ్యులు **శ్రీమతి బంగారు సావిత్రి గారు** వారి స్వగృహము నందు దైవసాయుజ్యము పొందిరి. వీరు విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందించేవారు.

వీరందరూ భౌతికంగా లేకపోవటము ఆశ్రమానికి తీరనిలోటు. భగవంతుడు, పూజ్య ఓంకార్ స్వామీజీ వీరి కుటుంబ సభ్యులకు తగిన ఆత్మ స్థైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాము.

# గురుచరణదాసి

**శ్రీరామకృష్ణాయ నమః**

పూజ్యశ్రీ స్వామి అనుభవానంద శిష్యురాలైన **పూజ్యశ్రీ త్యాగీశానంద మాతాజీ** శ్రీరామకృష్ణ భక్త సమాజము, బాపట్ల యొక్క అధ్యక్షులు **తేది 17-06-2021న** శివైక్యమునొందిరి. వీరు వారి గురువు గారి అడుగుజాడలలో నడచుకుంటూ, గురువు అందించిన జ్ఞాన సంపదను మానవాళికి సరళముగా అందించిరి. వీరు శాంతి ఆశ్రమమును అనేకసార్లు సందర్శించి ప్రవచనములను ఇచ్చిరి. వీరు భౌతికంగా లేకపోవడము సమాజమునకు తీరని లోటు.

# కార్యక్రమములు - మాతృ ఆశ్రమం

**తేది 15-08-2021 (ఆదివారం)** స్వాతంత్ర్య దినోత్సవము (ఉన్నతపాఠశాల)

**తేది 28-08-2021 (శనివారం)** పూజ్యశ్రీ స్వామి చిదానంద వారి పుణ్యఆరాధన (ఓంకార్ మందిరం)

**తేది 30-08-2021 (సోమవారం)** శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఉ॥ 7 గం॥లకు శ్రీకృష్ణ అష్టోత్తర శత నామార్చన (గోశాల నందు)

రా॥ 8 గం॥లకు సంకీర్తన, శ్రీకృష్ణ అష్టోత్తర శత నామార్చన (ప్రార్ధన మందిరం)

రా॥ 12 గం॥లకు ఊయల సేవ శ్రీగణేష్ ఆచార్య, శ్రీ గంగరాజు మాస్టారు గార్లచే నిర్వహించబడును.

## నిర్భందించకండి

ప్రవాహాన్ని ప్రవహించనివ్వండి - నిర్భందించకండి
పయనించె జీవితాన్ని పయనించనివ్వండి - నిర్భందించకండి
కాలచక్రం ముందుకే తిరుగుతుంది
అందుకే జీవితాన్ని ఎప్పుడూ నిర్భందించకండి
గాయాలను ఓర్చుకుంటూ, అవమానాలను ఇంకించుకుంటూ
ప్రవాహంలా ప్రవహించటమే జీవితం.

**ఎమ్.ఎస్. రంగారావు (బన్ను)**
సెల్ : 9908484132

# శాశ్వత అన్నదానం

1. శ్రీ రవి గుప్తా గారు (హైదరాబాద్) 20,000/-
వీరి పుట్టినరోజు సందర్భముగా
2. శ్రీ మాదాసు కిషోర్ చక్రవర్తి గారు, శ్రీమతి పుష్పాల శ్రావణి గారు 10,000/-
(హైదరాబాద్) వీరి కుమార్తె ఎమ్. చైత్ర గారి పుట్టినరోజు సందర్భముగా
3. శ్రీ కొల్లి ప్రసాద్ గారు (శాంతి ఆశ్రమం) 5,000/-
వీరి తండ్రి గారు కీ॥శే॥ కొల్లి అప్పలస్వామి గారి జ్ఞాపకార్థం
4. శ్రీ కక్కిరాల సత్యసాయి కుమార్ గారు 5,000/-
శ్రీమతి ప్రేమాబాయి గారు (శాంతి ఆశ్రమం)
వీరి అక్కగారు శ్రీమతి నిర్మలజ్యోతి గారి పుట్టినరోజు సందర్భముగా
5. శ్రీమతి కొల్లేపర సత్యవతి గారు (శాంతి ఆశ్రమం) 5,000/-
వీరి తల్లి గారు కీ॥శే॥ నార్కెడమిల్లి సుబ్బరాజుగారి జ్ఞాపకార్థం

## విరాళములు

1. శ్రీమతి పొన్నగంటి లక్ష్మీతులసి గారు (బెంగుళూరు) 10,000/-
వైఫ్ ఆఫ్ (లేటు) సత్యనారాయణ గారు వీరి భర్త
కీ॥శే॥ పి. సత్యనారాయణ గారి పుణ్య తిధిన అన్నదానం
2. శ్రీమతి పొన్నగంటి లక్ష్మీ తులసి గారు (బెంగుళూరు) 10,000/-
వీరి భర్త గారు కీ॥శే॥ పి. సత్యనారాయణ గారి పుణ్యతిథి నిమిత్తం గోగ్రాసం
3. శ్రీమతి ప్రదీప్ రేఖ & శ్రీ ఆర్యేష్ భరత్ రామ్‌లాల్ (ఋషికేష్) 50,000/-
4. శ్రీ వి. హనుమంత రావు గారు (కాకినాడ) 10,000/-
గిత్తలషెడ్ నిర్మాణము నిమిత్తం
5. శ్రీ అద్దంకి బుద్ధచంద్రదేవ్ గారు (కొత్తపేట) 10,000/-
వీరి అక్కగారు కీ॥శే॥ చామర్తి స్వరాజ్యలక్ష్మి కుమారి గారు
జ్ఞాపకార్థం అన్నదానం
6. శ్రీ కోలా సత్యనారాయణ మూర్తి గారు (శాంతి ఆశ్రమం) 10,116/-
గిత్తలషెడ్ నిర్మాణము నిమిత్తం
7. శ్రీమతి గార్లపాటి ఇందిర గారు (గుంటూరు) 10,000/-
గిత్తలషెడ్ నిర్మాణము నిమిత్తం
8. శ్రీమతి వి. హనుమాయమ్మ గారు (గుంటూరు) 5,000/-
గిత్తషెడ్ నిర్మాణము నిమిత్తం
9. శ్రీ కె.వి. చలపతి రావు గారు (హైదరాబాద్) 20,000/-
10. శ్రీమతి ఎస్. శ్రీదేవి గారు (కలకత్తా) వీరి తండ్రిగారు 40,000/-
కీ॥శే॥ శ్రీ వెంకట ఆదినారాయణ సారిక, ఆత్మశాంతి కోరుతూ గోదానం, అన్నదానం

11. శ్రీ ఎమ్. శివరామప్రసాద్ గారు & శివరాం మాలతి గారు (ఉత్తరాఖండ్) 2,000/-
12. శ్రీ టి.వి. సత్యనారాయణ గారు (హైదరాబాద్) 8001/-
వీరి కుమార్తె లేటు తమ్మన సాయి సుధ గారి పుణ్యతిథి అన్నదానం
13. శ్రీ ఎమ్. వెంకట శ్రీ కిరణ్ గారు (విశాఖపట్నం) 3,000/-
14. శ్రీ జి.ఎమ్.వి. రమణ గారు 10,000/-
15. శ్రీ కృష్ణ ద్వారకానాథ్ రావు గారు & వేదుల నిర్మల గారు (సికింద్రాబాద్) 3,000/-
16. శ్రీ నల్లం సత్యనారాయణ గారు (కాకినాడ) వీరి కుమారుడు 3,000/-
శ్రీ భాను వెంకట నగేష్ గారు కోడలు శ్రీమతి ఎన్. సుధారాణి గారు
మనుమరాలు చి॥ని సాయి సాన్విత గార్ల పుట్టినరోజులు సందర్భముగా గోగ్రాసం
17. శ్రీ సానిపిని వీర్రాజు గారు, శ్రీమతి వీరాయమ్మ గారు (వేట్లపాలెం) 10,000/-
గిత్తల షెడ్ నిర్మాణము నిమిత్తం
18. కంటిపూటి బలరాం మాస్టారు, శ్రీమతి భవాని గారు 10,000/-
వీరి కుమారుడు చంద్రమౌళి గారు (వేట్లపాలెం)
19. డా॥ జి.వి. కృష్ణారావు గారు (గుంటూరు) 1,000/-
20. శ్రీ గొల్లపూడి నాగేశ్వరరావు గారు 10,000/-
శ్రీ గొల్లపూడి జగపతి రావు గారు (గొల్లప్రోలు) వీరి తండ్రి గారు
కీ॥శే॥ గొల్లపూడి వీరబద్రం గారి తిథి సందర్భముగా అన్నదానం
21. కుమారి పుప్పాల సుబ్బలక్ష్మి (బేబి) గారు (పెద్దాపురం) 5,000/-
వీరి అన్నయ్య గారు కీ॥శే॥ పి.వి.వి. భగవాన్ గారి జ్ఞాపకార్థం అన్నదానం
22. శ్రీ గొల్లపూడి నాగేశ్వరరావు గారు (శాంతి ఆశ్రమం) 1000/-
23. శ్రీ బందెల సరోజనీ దేవి గారు (శాంతి ఆశ్రమం) 2,000/-
24. శ్రీ పర్వతాల పెదబాబు గారు (రాజమండ్రి) 5,000/-
వీరి తండ్రి గారు కీ॥శే॥ పి. సుబ్రహ్మణ్యం గారి జ్ఞాపకార్థం అన్నదానం
25. శ్రీమతి పి. సావిత్రి గారు (విశాఖపట్నం) 2,000/-
26. శ్రీ సి.హెచ్. శ్రీనివాస్ గారు (హైదరాబాద్) 1000/-
వీరి తల్లి గారు కీ॥శే॥ సి.హెచ్ లక్ష్మీనరసమ్మ గారి జ్ఞాపకార్థం గోగ్రాసం
27. శ్రీ ఆకొండి సూర్య ప్రకాశరావు గారు 10,000/-
తెలుగు పండితులు శాంతి హైస్కూల్ గోగ్రాసం నిమిత్తం
28. శ్రీ గ్రంథి సత్యనారాయణ మూర్తి గారు (గొల్లప్రోలు) 5,000/-
కీ॥శే॥ కె. రామారావు గారు వీరి భార్య కీ॥శే॥ కన్యాకుమారి గార్ల జ్ఞాపకార్థం అన్నదానం
29. శ్రీమతి దాసరి శేషారత్నం గారు (శాంతి ఆశ్రమం) 3,000/-
వీరి కుమార్తె పద్మగారి పుట్టినరోజు సందర్భంగా అన్నదానం

# శ్రీ శాంతి ఆశ్రమ ప్రచురణలు

1. శాంతి ప్రదాత శ్రీస్వామి ఓంకార్ ఆత్మకథ .................... 100/-
2. ఓంకార సద్బోధామృతము .................... 70/-
3. సోహం .................... 10/-
4. ఓం జపం .................... 10/-
5. మౌనపు ఘడియలు .................... 30/-
6. ప్రేమయే దైవము .................... 10/-
7. భగవత్సాక్షాత్కారము ఇప్పుడు ఇక్కడే .................... 10/-
8. శాంతి దళములు.................... 10/-
9. ఆధ్యాత్మిక మెరుపులు .................... 10/-
10. సత్సంగ సందేశములు .................... 30/-
11. ఓంకార సూక్తులు .................... 10/-
12. ఓంకార స్తోత్ర కదంబం.................... 10/-
13. శాంతి సూక్తులు .................... 10/-
14. శాంతి ప్రార్థన .................... 20/-
15. శ్రీ శాంతి స్తోత్రమాల .................... 30/-
16. స్వామి ఓంకార్ ఆత్మదర్శిని .................... 20/-
17. సందేశ తరంగిణి .................... 40/-
18. నా చెల్లి పునర్జన్మ.................... 10/-
19. నేను ఆంగ్లభాష ఎలా నేర్చుకొన్నాను.................... 20/-
20. శ్రీశ్రీశ్రీ ఓంకారస్వామి స్తోత్రము .................... 20/-
21. శాంతిదూత స్వామి ఓంకార్ .................... 30/-
22. స్వామి ఓంకార్ జీవిత విశేషాలు .................... 10/-
23. శ్రీశాంతి ఆశ్రమ చరిత్ర .................... 20/-
24. ధ్యానము .................... 30/-
25. పూజ్యశ్రీ జ్ఞానేశ్వరి మాతాజీ వారి దివ్య సందేశములు దేశ విదేశీయ పర్యటనలు... 50/-
26. ప్రార్థనలు - ధ్యానములు .................... 20/-
27. విశ్వప్రార్థన .................... 20/-
28. శ్రీ శాంతి ఆశ్రమం శతాబ్ధి సంచిక .................... 120/-
29. నిత్య సందేశములు .................... 20/-
30. ఆంతర్య భావనలు .................... 20/-
31. శ్రీ ఓంకార బోధామృతం .................... 20/-
32. నాల్గు దశలలో ఉపదేశము .................... 10/-
33. శాంతి ప్రార్థన - స్వామి ఓంకార్ .................... 20/-

This Periodical is Registered with Registrar of Newspapers, New Delhi Vide R.No. 3447/57, Dt. 18-12-20 Permitted to Post Under Concessional Postage Vide AP/KD-24/2021-2023

# SRI SANTI ASHRAM ENGLISH PUBLICATIONS

1. Auto Biography of Swami Omkar (2 Volumes) .......... Rs. 150/-
2. Life and Teachings of Swami Omkar ............................ Rs. 10/-
3. Soham .................................................................... Rs. 10/-
4. Cosmic Fast ........................................................Rs. 20/-
5. Meditation...........................................................Rs.10/-
6. Om Japa ...............................................................Rs.10/-
7. Control of Mind ....................................................Rs.30/-
8. Cosmic Flashes ....................................................Rs.10/-
9. In the Hours of Silence ........................................ Rs.10/-
10. The Soul of Omkar ...............................................Rs.10/-
11. How I learned English .........................................Rs.10/-
12. Reincarnation of my Little Sister ..........................Rs.10/-
13. God Realization Now and Here .............................Rs.10/-
14. Mystic Prayers and Poems ...................................Rs.20/-
15. The Divine Voice of Omkar ...................................Rs.40/-
16. Auto Biography of Omkar (Revised Edition) ...............Rs.100/-
17. Petals of Peace .....................................................Rs.20/-
18. The Story of my life and Work ..............................Rs.10/-
19. Priceless legacy of Swami Omkar ..........................Rs.10/-
20. The Four Initiations ..............................................Rs.10/-
21. Musings ...............................................................Rs.20/-
22. Peace Prayer ........................................................Rs.20/-

THE MISSION OF PEACE
శ్రీ శాంతి ఆశ్రమము
పోస్టు : శాంతి ఆశ్రమము
(వయా) శంఖవరం - 533 446.
తూ॥గో॥జిల్లా., (ఆ.ప్ర.)
ఫోన్ : 7382009962
email:srisanthiashram@gmail.com
www :www.srisantiashram.org.in

Printed Book

To

_______________

_______________

_______________

_______________

Printed by Swamy Offset Printers and Published by Swamini Vinamrananda on behalf of The Mission of Peace Sri Santi Ashram and Printed at Swamy Off-set Printers, Pithapuram - 533 450 Cell : 98485 19829 and Published at Thotapalli Hills 533 446 Ph : 7382009962 Editor : Swamini Vinamrananda.